# మన క్రాంతి
KR TV
ఇది వాస్తవ పత్రిక...

Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Vishakhapatnam,Tirupati

సంపుటి : 01 సంచిక :19 | గురువారం ,19 డిసెంబర్ 2024 | ఎడిటర్ : సందెపల్లి క్రాంతి కుమార్ | పేజీలు : 8 వెల: 3 రూ/-


## నేటిమాట

" మనుషులను చంపగలరేమో.. వారి ఆదర్శాలను చంపలేరు."

- భగత్ సింగ్



# పోటా పోటీ



- కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్'
- ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి భాయ్ భాయ్ - బీఆర్ఎస్
- అదానీపై జేపీసీ విచారణ
- కాంగ్రెస్ చలో రాజ్ భవన్ కార్యక్రమం
- రోడ్డుపై బైఠాయించి సీఎం రేవంత్ నిరసన
- ప్రధాని మోదీపై ఆగ్రహం
- అదానీ, ప్రధాని ఇద్దరు కలిసి దేశం పరువు తీశారు
- అదానీ విషయంలో బీఆర్ఎస్ స్టాండ్ ఏంటి?

**హైదరాబాద్ క్రాంతి న్యూస్:** కాంగ్రెస్ , బీఆర్ఎస్ నిరసనలతో తెలంగాణ రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. పోటాపోటీ నిరసనలతో రాష్ట్ర రాజకీయాలు రసవత్తరంగా మారాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు సహా కాంగ్రెస్ శ్రేణులు బుధవారం పెద్దఎత్తున నిరసన చేపట్టారు. అసెంబ్లీ నుంచి భారీ ర్యాలీ చేపట్టి రాజ్ భవన్ కు వెళ్లారు. అదానీ లంచం వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించకపోవటం, మణిపూర్ అంశంపై ప్రధాని మోదీ మాట్లాడకపోవడంపై నేడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసనలకు పిలుపునిచ్చింది. మరోవైపు అదానీ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ నిరసన చేపట్టింది. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ఉన్న ఫొటోలను ప్రదర్శిస్తూ అసెంబ్లీ లాబీల నుంచి మీడియా పాయింట్ వరకూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు.

2లో

# అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా..

## క్షమాపణలు చెప్పాలని రాజ్యసభలో కాంగ్రెస్ నోటీసు!

- అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని జపం చేయడం కాంగ్రెస్ కు ఫ్యాషన్ గా మారింది
- రాజకీయ లబ్ధి కోసం బీఆర్ అంబేద్కర్ పేరును వాడుకుంటుంది: అమిత్ షా
- అంబేద్కర్‌ను అమిత్ షా రాజీనామా చేయాలి - విపక్షాలు
- మనుస్మృతిని విశ్వసించే వారు ఖచ్చితంగా అంబేద్కర్‌తో విభేదిస్తారు - రాహుల్ గాంధీ
- సంఘ్ పరివార్ మనుస్మృతిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారు - మల్లికార్జున ఖర్గే
- బీజేపీ ముసుగు వీడిపోయింది - మమతా బెనర్జీ
- అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తుంది - మోడి
- నేను కలలో కూడా అంబేద్కర్‌ను అవమానించలేను - అమిత్ షా

అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని జపం చేయడం ఇప్పుడు ఫ్యాషన్ గా మారిందని ఆయన అన్నారు. అంబేద్కర్ పేరుకు బదులుగా దేవుడి పేరు తలుచుకుంటేనైనా కొంచెం పుణ్యమైన వస్తుంది..స్వర్గానికి వెళ్లొచ్చని అవమానించిన హెూం మంత్రి అమిత్ షా

క్రాంతి న్యూస్



**నేను కలలో కూడా అంబేద్కర్‌ను అవమానించలేను.. అమిత్ షా**

అంబేద్కర్ వివాదంలో తనపై విమర్శలు చేస్తున్న విపక్షాలపై అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను కలలో కూడా అంబేద్కర్‌ను అవమానించలేదన్నారు. కాంగ్రెస్ అంబేద్కర్ సిద్ధాంతాలకు, రాజ్యాంగానికి వ్యతిరేకి అన్నారు. నెహ్రూ అంబేద్కర్‌ను ద్వేషించేవారని, ఏనాడు అంబేద్కర్‌ను గౌరవించలేదన్నారు.

2లో

# 'దమ్ముంటే చర్చకు రండి' - కేటీఆర్

- సీఎం రేవంత్ కేటీఆర్ ఓపెన్ ఛాలెంజ్
- నాలుగు గోడల మధ్య కాదు.. నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ పెట్టండి
- ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది
- ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలు ప్రచారం
- రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను
- రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఈ రేస్ బలి

హైదరాబాద్ క్రాంతి న్యూస్:

తెలంగాణలో ఈ-కార్ రేస్ దుమారం మరోసారి రేగు తోంది.ఈ అంశంపై చర్చకు తాము సిద్ధమని కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్ ఓపెన్ ఛాలెంజ్ విసిరారు.



2లో

తెలంగాణలో ఈ-కార్ రేస్ దుమారం మరోసారి రేగుతోంది. ఈ కేసులో కేటీఆర్‌కు విచారించడానికి గవర్నర్ అనుమతి లభించిందని ప్రభుత్వం తెలిపింది. ఇప్పటికే గవర్నర్ అనుమతించిన పత్రాలను తెలంగాణ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి మంగళవారం రాత్రి ఏసీబీ అధికారులకు అందించారు. దీంతో ఏసీబీ అధికారులు ఏ క్షణానైనా కేటీఆర్‌ను విచారించడానికి చర్యలు చేపట్టొచ్చు. ఈ క్రమంలో ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి దమ్ముంటే ఈ అంశంపై అసెంబ్లీ చర్చకు అనుమతించాలని ఛాలెంజ్ చేశారు. తాము చర్చకు సిద్ధమని, ఇందులో కాంగ్రెస్ చెప్తున్నవి వాస్తవాలే అయినా వారు కూడా చర్చకు రావాలని పిలిచారు. కేటీఆర్ తన లేఖలో అనేక అంశాలను వివరించారు. 2023లో తమ ప్రభుత్వం నిర్వహించిన ఈ-కార్ రేస్.. అన్ని వర్గాల వారి మన్ననలు అందుకున్నదని చెప్పారు. తమ పార్టీకి చెడ్డపేరు తీసుకురావడమే పరమావధిగా కాంగ్రెస్ పని చేస్తోందని, బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ప్రతిష్టను చెడగొట్టడం కోసం కాంగ్రెస్ చేస్తున్న ప్రయత్నం ఒక పదిపాళ్లు ప్రజల సమస్యలపై పెట్టినా నెల రోజుల్లో అన్ని సమస్యలు పరిష్కరించబడుతాయంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# తాగి అసెంబ్లీకి వస్తున్నారు..

## హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు

- ఆటో డ్రైవర్ల వేషధారణలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
- ఆటో నడిపిన కేటీఆర్
- 93 మరణాలు ప్రభుత్వ హత్యలే
- అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలి
- మామ చాటు అల్లుడిగా రూ.10వేల కోట్లు దోచుకున్న దొంగ హరీశ్ రావు
- ఆటో డ్రైవర్లకు రూ.12వేలు ఇవ్వాలి



2లో

హైదరాబాద్ క్రాంతి న్యూస్:

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం తీరును నిరసిస్తూ మంగళవారం నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి హాజరైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు బుధవారం ఆటో డ్రైవర్ల వేషధారణలో వచ్చారు

# అసెంబ్లీలో భూభారతి 2024 బిల్లు..

## పతిపక్షాల అభ్యంతరం

హైదరాబాద్ క్రాంతి న్యూస్:

తెలంగాణ భూభారతి 2024 బిల్లును మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మంత్రి ప్రసంగిస్తూ.. నాలుగు గోడల మధ్యన కూర్చొని ధరణి పోర్టల్ తెచ్చారని.. వేల పుస్తకాలు చదివిన మేధావి తెచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టంతో లక్షల సమస్యలు వచ్చాయన్నారు. ఇచ్చిన మాట ప్రకారం.. ఇద్దరు వ్యక్తులు తయారుచేసిన ధరణి, ఆర్వోఆర్ చట్టాన్ని ప్రక్షాళన చేశామని మంత్రి తెలిపారు.



3లో

# కాంగ్రెస్ కష్టాలు కొని తెచ్చుకుంటోందా?

- కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేస్తే చెరిగిపోతాయా..!
- కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోయినా.. తెలంగాణలో ఆయనకున్న గుర్తింపు, పేరు తగ్గదు
- కాంగ్రెస్ పేరు చెబితే మహిళలకు ఫ్రీ బస్సు మినహా ఏది గుర్తురాదు
- కేసీఆర్ పేరు చెపితే సచివాలయం, అమరవీరుల స్తూపం, అంబేద్కర్ విగ్రహం, కాళేశ్వరం ప్రాజెక్టు, సంక్షేమ పథకాలు ఇట్లా చాలానే ఉన్నాయి
- కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాడు అన్న పేరు పెద్దదే
- కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని మాట్లాడటం సరికాదు ఓ కాంగ్రెస్ నేత
- కేటీఆర్, హరీష్ రావుని విమర్శించినా నష్టం ఉండదు
- కేసీఆర్ గురించి మాట్లాడేటప్పుడు కాస్త ఆలోచించుకొని విమర్శలు చేయాలి



2లో

## తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా

# దిల్ రాజు ప్రమాణ స్వీకారం



**హైదరాబాద్ క్రాంతి న్యూస్:** ఇటీవల తెలంగాణ ప్రభుత్వం సక్సెస్ ఫుల్ నిర్మాత దిల్ రాజు (వెంకటరమణా రెడ్డి)ని తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించిన విషయం తెలిసిందే. 2 సంవత్సరాల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. దీనికై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక జీవోని కూడా జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం తనకు ఇచ్చిన పదవీ బాధ్యతలను బుధవారం దిల్ రాజు స్వీకరించారు. ఉదయం ఫిల్మ్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, చైర్మన్ సింహాసనాన్ని అధిష్టించారు.

3లో



**మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా 24 మందికి బెయిల్**

3లో



**కెసిఆర్ ని మించిన గజ దొంగ రేవంత్ రెడ్డి ...**

3లో



**ఆ గ్రామమంతా తేదాపానే..**

4లో



**రిటైర్మెంట్ ప్రకటించిన రవిచంద్రన్ అశ్విన్**

7లో



8లో

**సూపర్ స్ట్రాటజీతో జాక్ రిలీజ్ డేట్ ఫైనల్**

# అంబేద్కర్‌ను అవమానించిన అమిత్‌షా..

# క్షమాపణలు చెప్పాలని రాజ్యసభలో కాంగ్రెస్ నోటీసు!

మొదటి పేజీ తరువాయి

అంబేద్కర్‌ను ఉద్దేశిస్తూ రాజ్యసభలో అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర దుమారం రేగుతోంది. అమిత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలంటూ పార్లమెంటు ఆవరణలో విపక్షాలు నిరసన చేపట్టాయి. బీజేపీ కులతత్వ, దళిత వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శనమంటూ మమతా బెనర్జీ మండిపడ్డారు. మిస్టర్ షా దళితుల చిహ్నన్ని అవమానించారని కాంగ్రెస్, ఇతర ప్రతిపక్ష పార్టీల నాయకులు ఆరోపణలు చేశారు. హెూం మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు అంబేద్కర్‌ను కాంగ్రెస్ ఎలా పక్కన పెట్టిందనే విషయాన్ని కాకుండా.. ఈ చిన్న వీడియో క్లిప్‌ను కాంగ్రెస్ ప్రసారం చేస్తోందని బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌ను అవమానించినందుకు కేంద్ర హెూంశాఖ మంత్రి అమిత్‌షా క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేస్తోంది. భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75 ఏళ్లు పూర్తైన ఈ సందర్భంగా పార్లమెంట్ లోని ఉభయ సభల్లో రెండు రోజుల పాటు భారత రాజ్యాంగంపై చర్చ కొనసాగింది.

కాగా, మంగళవారం నాడు జరిగిన చర్చ సమయంలో కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా కాంగ్రెస్‌పై తీవ్రంగా మండిపడ్డారు. రాజకీయ లబ్ధి కోసం బీఆర్ అంబేద్కర్ పేరును వాడుకుంటుందని అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని జపం చేయడం ఇప్పుడు ఫ్యాషన్ గా మారిందని ఆయన అన్నారు. అంబేద్కర్ పేరుకు బదులుగా దేవుడి పేరు తలుచుకుంటేనైనా కొంచెం పుణ్యమైన వస్తుంది.. స్వర్గానికి వెళ్లొచ్చని హస్తం పార్టీపై విరుచుకు పడ్డారు.

అయితే, అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ?కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీతో పాటు ఏఐసీసీ అధినేత మల్లికార్జున్ ఖర్గేలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మనుస్మృతిని విశ్వసించే వారు ఖచ్చితంగా అంబేద్కర్‌తో విభేదిస్తారు అని ఎక్స్ (ట్విట్టర్) వేదికగా రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. బాబాసాహెబ్ అంబేద్కర్‌ను హెూంమంత్రి షా అవమానించడంతో బీజేపీ–ఆర్ఎస్ఎస్ జాతీయ జెండాకు వ్యతిరేకమని పేర్కొన్నారు.

అలాగే, బీజేపీ– ఆర్ఎస్ఎస్ పూర్వీకులు సైతం అశోక్ చక్రాన్ని వ్యతిరేకించారని.. సంఘ్ పరివార్ ప్రజలు మనుస్మృతిని అమలు చేసేందుకు చూస్తున్నారని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే విమర్శించారు. అంబేద్కర్ ఆ దేవుడి కంటే తక్కువేం కాదు.. ఆయన దళితులు, గిరిజనులు, బీసీలు, మైనారిటీలు, పేదలకు అండగా నిలిచారని చెప్పుకొచ్చారు. ఇక, అంబేద్కర్ ను అవమానించిన కేంద్ర హెూంమంత్రి తక్షణమే క్షమాపణలు చెప్పాలని రాజ్యసభలో కాంగ్రెస్ ఎంపీలు నోటీసు ఇచ్చింది.

## ప్రియాంక గాంధీ..

'అంబేద్కర్ కోట్లాది మంది దళితులు, అణగారిన వర్గాల ప్రజల ఆత్మగౌరవాలకు ప్రతీక. ఆయన పేరు ప్రస్తావించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తాం. అలాంటి వ్యక్తిని బీజేపీ కించపరుస్తోందంటూ ప్రియాంక మండిపడ్డారు.

## మమతా బెనర్జీ..

'అంబేద్కర్ మార్గదర్శకత్వం, స్ఫూర్తిబాటలో నడిచే లక్షలాది మందికి అమిత్ షా వ్యాఖ్యలు అవమానకరం. ఈ వ్యాఖ్యలతో బీజేపీ ముసుగు వీడిపోయింది. ప్రజాస్వామ్య దేవాలయంలోనే అంబేద్కర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేయడం దారుణం. ద్వేషంతో నిండిపోయిన పార్టీ నుంచి ఇంకేమి ఆశించగలం' అని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## మోదీ విమర్శలు..

ఈ వివాదంపై ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. కాంగ్రెస్‌తో పాటు ప్రతిపక్షాలపై మండిపడ్డారు. అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలను కించపరిచేందుకు కాంగ్రెస్ ఎలాంటి విధివిధానాలను ఆచరిస్తోందో ప్రజలు చూస్తూనే ఉన్నారన్నారు. 'కాంగ్రెస్ పార్టీ, దాని కుళ్లిన పర్యావరణ వ్యవస్థ రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్‌ను అవమానించడాన్ని ద్వేషపూరిత అబద్దాలు దాచగలవని భావిస్తే వారంతా పొరపాటుపడ్డట్లే. దేశ ప్రజలు ఓ రాజవంశం నాయకత్వంలోని పార్టీ ఎలాంటి విధివిధానాలను ఆచరిస్తోంది? అంబేద్కర్ వారసత్వాన్ని తుడిచిపెట్టడానికి, %జాజ/ూ%లను అవమానపరిచేందుకు అవసరమైన ప్రతీ అవకాశాన్ని వదులుకోకపోవడాన్ని గమనిస్తున్నారు' అని విమర్శించారు.

## ఉద్ధవ్ ఠాక్రే

బీజేపీ మిత్రపక్షాలు అమిత్ షా వ్యాఖ్యలతో ఏకీభవిస్తాయా? అంటూ శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే ప్రశ్నించారు. అంబేద్కర్ పేరును బీజేపీ, కాంగ్రెస్‌లు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నాయని మండిపడ్డారు. ఆయన సేవలను గౌరవించడంలో విఫలమవుతూనే ఉన్నాయని బీఎస్పీ అధినేత్రి మాయావతి సైతం ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నేను కలలో కూడా అంబేడ్కర్‌ను అవమానించలేను.. అమిత్ షా

### 75 ఏళ్ల దేశం గర్వించదగ్గ ప్రయాణం..

కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ వ్యతిరేక పార్టీ, రాజ్యాంగ వ్యతిరేక పార్టీ అని బీజేపీ వక్తలు చెప్పడం వల్లే ఇలా జరిగిందని హెూంమంత్రి అన్నారు. కాంగ్రెస్ సావర్కర్‌ను అవమానించింది. ఎమర్జెన్సీ విధించడం ద్వారా కాంగ్రెస్ రాజ్యాంగాన్ని తుంగలో తొక్కింది. భారత బలగాలను కాంగ్రెస్ అవమానించింది. కాంగ్రెస్ దేశ భూమిని ఇచ్చింది. ఇది పార్లమెంటులో రుజువయ్యాక కాంగ్రెస్ అసత్యాలు ప్రచారం చేయడం ప్రారంభించింది. కాంగ్రెస్ పార్టీ అంబేద్కర్ వ్యతిరేకి. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగ వ్యతిరేకం. సైన్యంలోని అమరవీరులను కాంగ్రెస్ అవమానించింది. కాంగ్రెస్ సావర్కర్ వ్యతిరేకి. కాంగ్రెస్ బాబా సాహెబ్‌కు గౌరవం ఇవ్వలేదు. పండిట్ జీ (నెహ్రూ) అనేక పుస్తకాలలో బాబా సాహెబ్‌కు సరైన స్థానం ఇవ్వలేదని రాయబడిందని చెప్పారు.

## బాబా సాహెబ్ కు భారతరత్న ఇవ్వలేదు..

భారతరత్న ఇచ్చే విషయానికొస్తే.. కాంగ్రెస్ నేతలే స్వయంగా చాలాసార్లు భారతరత్న ఇచ్చుకున్నారు. 1955లో నెహ్రూ జీకి భారతరత్న, 1971లో ఇందిరాజీకి భారతరత్న ఇచ్చుకున్నారని విమర్శించారు. ఇక 1990లో బీజేపీ హయాంలో బాబా సాహెబ్‌కు భారతరత్న లభించిందని చెప్పారు. 1990 వరకు బాబా సాహెబ్‌కు భారతరత్న రాకుండా కాంగ్రెస్ ప్రయత్నించిందని, బాబా సాహెబ్ 100వ జయంతి వేడుకలు కూడా నిషేధించబడ్డాయని గుర్తు చేశారు.

## అంబేడ్కర్ 370కి వ్యతిరేకం..

సెలెక్టెడ్ వర్క్స్ ఆఫ్ జవహర్ లాల్ నెహ్రూ అనే పుస్తకంలో నెహ్రూ జీ గురించి మరో ప్రస్తావన ఉందని ఆయన అన్నారు. నెహ్రూ జీ హామీ ఇచ్చినప్పటికీ అంబేద్కర్ జీకి ముఖ్యమైన శాఖ ఏదీ ఇవ్వలేదు. అంబేద్కర్ జీ ప్రభుత్వ విధానాలకు, ముఖ్యంగా విదేశీ వ్యవహారాలు, రక్షణ, షెడ్యూల్డ్ కులాలు, తెగలకు సంబంధించిన విధానాలకు వ్యతిరేకమని స్పష్టంగా పేర్కొన్నారు. అంబేద్కర్ జీ 370కి వ్యతిరేకం. ఏ ఐ ఎడిట్ చేసిన నా వీడియోను కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఉపయోగించింది. నా ప్రకటనలను తప్పుగా చూపించారు. కాంగ్రెస్ తప్పుడు వార్తలను ప్రచారం చేస్తోంది. మండల్ కమిషన్ నివేదికను ఇందిరాగాంధీ అమలు చేయలేదు. ఓబీసీ రిజర్వేషన్‌ను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేతగా రాజీవ్ గాంధీ సుదీర్ఘ ప్రసంగం చేశారని తెలిపారు.

# పోటా పోటీ

మొదటి పేజీ తరువాయి

## కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్'

హైదరాబాద్, క్రాంతి న్యూస్: అదానీపై జేపీసీ విచారణ, మణిపూర్‌లో శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఏఐసీసీ ఛలో రాజ్ భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో 'చలో రాజ్‌భవన్' చేపట్టారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు నేతలు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ నిరసన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ అండదండలతో అదానీ దేశంలోని వ్యవస్థలను, బ్యాంకులను మభ్య పెడుతున్నారని, కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు. ఈ వ్యవహారంపై వినతిపత్రం అందించేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వకపోవటంతో.. రాజ్ భవన్‌కు 100 మీటర్ల దూరంలోనే రేవంత్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మీడియాతో సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. అదానీ అంశంతో పాటు, మణిపూర్ అల్లర్లపై మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు.

'ప్రభుత్వమే ధర్నాలు చేయడం ఏంటని కొందరు ప్రశ్నిస్తున్నారు. మా నిరసన కొందరికి నచ్చకపోవచ్చు. అదానీ, మోదీ దేశం పరువు తీస్తున్నారు. పార్లమెంట్‌లో నిలదీసినా స్పందన లేదు. ముందు అదానీ విషయంలో బీఆర్ఎస్ స్టాండ్ ఏంటో చెప్పాలి. 75 ఏళ్ల పాటు కష్టపడి కాంగ్రెస్ దేశ ప్రతిష్టను పెంచింది. కానీ అదానీ, ప్రధాని ఇద్దరు కలిసి దేశం పరువు తీశారు. వ్యాపారం చేసేందుకు అదానీ అంచాలు ఇచ్చారని అమెరికా సంస్థలు తేల్చాయి. అంశంపై మాట్లాడేందుకు, చర్చించేందుకు ప్రధాని మోదీ మౌనం వహిస్తున్నారు.

## బంధం బయటపెడతాం..

మరోవైపు అదానీ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ నిరసన చేపట్టింది. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి కలిసి ఉన్న ఫొటోలను ప్రదర్శిస్తూ అసెంబ్లీ లాబీల నుంచి మీడియా పాయింట్ వరకూ ఆ పార్టీ ఎమ్మెల్యేలు నిరసన చేపట్టారు. అదానీ, రేవంత్ భాయ్ భాయ్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన నిరసన కార్యక్రమంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు ఆగ్రహించారు. డైవర్షన్ పాలిటిక్స్ కోసమే రోడ్లపై సీఎం రేవంత్ సర్కస్ ఫీట్లు చేస్తున్నారని హరీశ్ రావు మండిపడ్డారు. అదానీతో రేవంత్ రెడ్డిది ఢిల్లీలో దోస్తీ.. గల్లీలో కుస్తీ అని ఎద్దేవా చేశారు. అదానీకి ఏజెంట్ మాదిరి తెలంగాణ ముఖ్యమంత్రి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు హరీశ్ రావు. రాజ్ భవన్ ఎదుట రోడ్డుపై బైఠాయించి ట్రాఫిక్ జామ్ చేసిన ముఖ్యమంత్రిపై హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ కేసులు నమోదు చేయాలని మాజీ మంత్రి డిమాండ్ చేశారు.

అదానీ వ్యవహారంపై తెలంగాణ అసెంబ్లీలో చర్చించాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. రాజ్ భవన్ వద్ద రేవంత్ మాట్లాడింది నిజమే అయితే రాష్ట్ర పరువును ఆయన మంట కలిపినట్లేనని అన్నారు. అదానీపై మాట్లాడే ధైర్యం లేకనే కేసీఆర్, కేటీఆర్ గురించి రేవంత్ మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. కాంగ్రెస్ హైకమాండ్ తిట్టినందుకే అదానీ రూ.100 కోట్లను రేవంత్ రెడ్డి వాపస్ ఇచ్చారని హరీశ్ రావు ఆరోపించారు. అదానీపై కాంగ్రెస్‌పై పోరాటం నిజమైతే రూ.12.400 కోట్ల ఒప్పందాలు వెంటనే రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసు పహారా మధ్య రామన్నపేటలో అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ నిర్మాణం జరుగుతోందని చెప్పారు. రాహుల్ గాంధీని సైతం సీఎం రేవంత్ రెడ్డి మోసం చేస్తున్నారని, అసెంబ్లీ సాక్షిగా అదానీ, రేవంత్ బంధం బయటపెడతామని అన్నారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంతనో.. రేవంత్ రెడ్డి మాటల్లో నిజం కూడా అంతేనని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు.

# 'దమ్ముంటే చర్చకు రండి' - కేటీఆర్

## కేటీఆర్ లేఖ యథాతథంగా..

మొదటి పేజీ తరువాయి

"ఫార్ములా–ఈ రేస్ వ్యవహారంలో మీ ప్రభుత్వం కొన్ని నెలలుగా గత బీఆర్ఎస్ ప్రభుత్వం మీద, ముఖ్యంగా నా మీద అనేక నిరాధార అరోపణలు చేస్తున్నది. ఇదే విషయం మీద ఈ వారం మీ ఆధ్వర్యంలో జరిగిన క్యాబినెట్ సమావేశంలో గంటన్నర సేపు చర్చ కూడా జరిగినట్టు వార్తా కథనాలు వచ్చాయి. ఇదే అంశం మీద కేసులు నమోదు చేస్తామని, గవర్నర్ ఆమోదం వచ్చిందని రకరకాల లీకులు ముఖ్యమంత్రి కార్యాలయం నుండి మీడియాకు ఇస్తున్నారు. ఈ అంశం మీద నాలుగు గోడల మధ్య చర్చ కన్నా రాష్ట్ర శాసన సభలో నాలుగు కోట్ల మంది ప్రజల ముందు చర్చ జరిగితే నిజానిజాలు ఏమిటో అందరికీ తెలుస్తాయి.

తెలంగాణ రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి జరగాలనే సదుద్దేశంతో గత ప్రభుత్వం ఫార్ములా–ఈ రేస్ నిర్వాహకులతో ఒక ఒప్పందం చేసుకున్నది. 2023లో విజయవంతంగా రేస్ జరిగి అన్ని వర్గాల మన్ననలు అందుకున్నది. ఈ రేస్ వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సుమారు రూ.700 కోట్ల రూపాయల లబ్ది చేకూరింది అని నీల్సన్ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. 2024లో మరో దఫా రేస్ జరగవలసి ఉండగా మీ ప్రభుత్వం వచ్చిన వెంటనే దాన్ని ఏకపక్షంగా రద్దు చేయడం జరిగింది. అప్పటి నుండి రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా ఈ రేస్ గురించి అనేక అవాస్తవాలను మీడియా ద్వారా ప్రచారం చేసి, ఇందులో ఏదో జరిగింది అనే అపోహలు సృష్టించే ప్రయత్నం మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్నది.

నిజానికి ఫార్ములా– ఈ రేస్ ఒప్పందం అంతా పారదర్శకంగా జరిగింది. రేస్ నిర్వాహకులకు చెల్లింపులు కూడా పారదర్శకంగానే జరిగాయి అని ఇదివరకే నేను వివరంగా చెప్పడం జరిగింది. అయినా మీ ప్రభుత్వం మాత్రం దుష్ప్రచారం మానడం లేదు. రాష్ట్ర ప్రజలకు నిజాలేమిటో తెలుసుకునే హక్కు ఉన్నది. కనుక మీరు శాసనసభలో ఈ అంశంపై చర్చ పెట్టాలని నేను డిమాండ్ చేస్తున్నాను.

అన్ని విషయాలు సవివరంగా రాష్ట్ర ప్రజలకు శాసన సభ వేదికగా చెబుదాం. శాసన సభ సెషన్ జరుగుతున్నది కనుక మీకు అనుకూలమైన రోజే ఈ చర్చను పెట్టండి. మరోసారి చెబుతున్నాను. ఫార్ములా ఈ అంశంలో ఎలాంటి అవకతవకలు కానీ, అవినీతి కానీ జరగలేదు. రాష్ట్రానికి, హైదరాబాద్ నగరానికి మంచి చేసే ఈ రేస్ ను కేవలం మీ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు బలి చేశారు. దీనిపైన శాసనసభలో సవివరమైన చర్చ జరిగితే నిజానిజాలేమిటో నిగ్గుతేలుతాయి" అని కేటీఆర్ రాసుకొచ్చారు.

విలేకరులు కావలెను..

మీ ప్రాంతంలో జరుగుతున్న అవినీతిని బయటపెట్టాలని ఉందా?

నిజాన్ని నిర్భయంగా చెప్పాలని ఉందా?

మన క్రాంతి తెలుగు దిన పత్రికలో

పనిచేయుటకు మండలాల వారీగా విలేఖరులు,

యాడ్ ఎగ్జిక్యూటివ్ లు (పురుషులు మరియు స్త్రీలు) కావలెను.

కాల్ : 9281041008 వెబ్: https://epaper.krtvnews.com

ఈమెయిల్: krtv.md@gmail.com

# తాగి అసెంబ్లీకి వస్తున్నారు..

# హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు

మొదటి పేజీ తరువాయి

. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాని ఆటో డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఆటో డ్రైవర్లకు మద్దతుగా వారి వేషధారణలో అసెంబ్లీకి వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆటో నడుపుతూ రావడం విశేషం. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 93 మంది ఆటో డ్రైవర్లు మరణించారని వారి మరణాలన్నీ ప్రభుత్వ హత్యలేనని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు.

## 93 మరణాలు ప్రభుత్వ హత్యలే

2023 ఎన్నికల ప్రచారంలో రాష్ట్రంలో ఆటో కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ర్యాలీగా అసెంబ్లీకి బయలుదేరారు. ఆటోలలో అసెంబ్లీకి బయలుదేరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వయంగా ఆటో డ్రైవ్ చేస్తూ అసెంబ్లీకి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనలో ఆత్మహత్య చేసుకున్న 93 మంది ఆటో డ్రైవర్ల మరణాలన్నీ ప్రభుత్వ హత్యలే అని ఆరోపించారు. ఆటో డ్రైవర్లను ఎన్నికల కోసం వాడుకున్న ప్రభుత్వం వారికి ఇచ్చిన హామీలన్నింటిని మర్చిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు.

## రూ.12వేలు ఇవ్వాలి

రాష్ట్రవ్యాప్తంగా ఏడున్నర లక్షల మంది ఆటో డ్రైవర్ల కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నట్టేట ముంచింది బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆత్మహత్య చేసుకున్న ఆటో డ్రైవర్ కుటుంబాలను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఇస్తామని చెప్పిన రూ.12 వేల ఆర్థిక సహాయాన్ని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అన్నారు. అంతేకాదు ఆటో డ్రైవర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

అసెంబ్లీలోకి వచ్చే సభ్యులకు డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని మాజీమంత్రి హరీశ్‌రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. కొంతమంది సభ్యులు డ్రింక్ చేసి సభకు వస్తున్నారని, సభలోకి వచ్చి ఏం మాట్లాడుతున్నారో వారికే తెలియడం లేదని అన్నారు. అసెంబ్లీ బయట డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు పెట్టాలని హరీష్ రావు సూచించారు. మరోసారి మంత్రి శ్రీధర్ బాబు ఆరోపణలు చేయవద్దని సూచించారు. దీంతో మండిన హరీశ్ రావు సుద్దులు తమకు చెప్పడం కాదు వారి సహచర మంత్రికి కూడా చెప్పాలి అని హితవు పలికారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కమీషన్ లిస్టు చదవమంటే నేను చదువుతాను అని హరీశ్‌రావు హెచ్చరించారు.

మాజీమంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావుపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మామ చాటు అల్లుడిగా రూ.10వేల కోట్లు దోచుకున్న దొంగ హరీశ్ రావు అని మండిపడ్డారు. అంతేకాదు పలు సంస్థలకు బినామీగా వ్యవహరించారని ఆరోపించారు. ఆ అవినీతిని తాము నిరూపిస్తామని చెప్పుకొచ్చారు. తాను తన రాజకీయ జీవితంలో ఏనాడూ అవినీతికి పాల్పడలేదు అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపణలపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సభ్యులపై ఆరోపణలు చేయొద్దని శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్ బాబు రూలింగ్ బుక్ చూపించి చెప్పారని హరీశ్‌రావు గుర్తు చేశారు.

# కాంగ్రెస్ కష్టాలు కొని తెచ్చుకుంటోందా?

మొదటి పేజీ తరువాయి

రేవంత్ సారథ్యంలోని కాంగ్రెస్ సర్కారుకు ఏడాది నిండింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై ప్రజల్లో చాలా వరకు అసంతృప్తి వ్యక్తమవుతోంది. అదే సమయంలో కొందరు చేసే పొలిటికల్ కామెంట్స్ రచ్చ చేస్తున్నాయి. ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ ఆనవాళ్ల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

కేసీఆర్.. తెలంగాణ మలిదశ పోరాటంలో కీలకంగా వ్యవహరించిన నేత. తెలంగాణ ఏర్పాటులో కేసీఆర్ పాత్ర ఎంతో కీలకం. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన కృషి ఎన్నో మంచి ఫలితాలను ఇచ్చిందనే అభిప్రాయాలు ఉన్నాయి. అయితే.. కేసీఆర్ తీసుకున్న రాజకీయ నిర్ణయాలు, ఇతర కారణాల వల్ల ప్రజలు బీఆర్ఎస్‌ను ఓడించారు. కానీ ఇప్పటికీ కేసీఆర్ అంటే తెలంగాణ, తెలంగాణ అంటే కేసీఆర్ అనే భావన చాలామందిలో ఉంది.

ప్రజలు కాంగ్రెస్ పార్టీకి స్పష్టమైన మెజార్టీ ఇచ్చారు. ఐదేళ్లు పాలించమని, ఇచ్చిన హామీలు నేరవేర్చమని ఎన్నికల్లో గెలిపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా వడివడిగా అడుగులు వేస్తోంది. అటు హామీల అమలు, ప్రభుత్వ పనితీరుపై చాలావరకు ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. చాలా వరకు హామీలు అమలు సాధ్యంకావడం లేదు.. అయినా కూడా ముమ్మందు చేస్తారులే అనే భావన ప్రజల్లో ఉంది.

ఇక్కడిదాకా బాగానే ఉన్నా.. అసలు సమస్య ఈ మధ్యనే మొదలైంది. తెలంగాణ తల్లి విగ్రహం రూపురేఖలు మారిపోయాయి. దీన్ని బీఆర్ఎస్ గట్టిగా వ్యతిరేకించింది. అంతే స్థాయిలో కాంగ్రెస్ తిప్పికొట్టింది. కానీ.. కాంగ్రెస్ నేతలు మరో అడుగు ముందుకేసి ఓ కీలకమైన కామెంట్ చేశారు. తెలంగాణలో కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని.. స్వయంగా సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

ఈ కామెంట్స్ ఇప్పుడు కాంగ్రెస్ పార్టీకి కష్టాలను తీసుకొస్తున్నాయని.. రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాంగ్రెస్ లీడర్లు ఇష్యూపై మాట్లాడి.. విమర్శలు చేస్తే బాగుండేదని.. అనవసరంగా కేసీఆర్ ఆనవాళ్ల అంశాన్ని నెత్తిన వేసుకున్నారని.. అదే పార్టీకి చెందిన నేతలు అంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఏడాదే అయ్యింది. ఈ ఏడాదిలో మహిళలకు ఫ్రీ బస్సు మినహా.. కాంగ్రెస్ పేరు చెబితే ఇంకేం గుర్తుకురావు అనే అభిప్రాయాలు ఉన్నాయి.

కానీ.. కేసీఆర్ పేరు చెబితే.. ఇప్పుడున్న సచివాలయం, అమరవీరుల స్తూపం, అంబేద్కర్ విగ్రహం, హైదరాబాద్‌లో రోడ్ల అభివృద్ధి, జిల్లాల్లో కలెక్టరేట్లు, కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, రైతుబంధు, రైతు బీమా, వ్యవసాయానికి ఉచిత కరెంట్.. ఇలా ఎన్నో పథకాలు గుర్తొస్తాయి. అన్నింటికి మించి.. కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించాడనే పేరుందనే కామెంట్స్ వినిపిస్తున్నాయి.

'కేసీఆర్ హయాంలో ఉన్న పథకాల్లో అక్రమాలు జరిగాయా లేదా అనే విషయంపై విమర్శలు చేస్తే బాగుండేది. కానీ కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామని మాట్లాడటం సరికాదు. గతంలో కేసీఆర్ ఇలానే హేళనగా మాట్లాడి, ఇతర పార్టీల నాయకులను చులకనగా మాట్లాడి నష్టపోయారు. ఇప్పుడు మా కాంగ్రెస్ పార్టీ వాళ్లు అదే చేస్తున్నారు. కేటీఆర్, హరీష్ రావు లాంటి వారిని విమర్శించినా పెద్దగా నష్టం ఉండదు. కానీ.. కేసీఆర్ గురించి మాట్లాడేటప్పుడు కాస్త ఆలోచించుకొని విమర్శలు, ఆరోపణలు చేస్తే బాగుంటుంది' కాంగ్రెస్ సీనియర్ నేత ఒకరు అభిప్రాయపడ్డారు.

'కేసీఆర్ ఎన్నికల్లో ఓడిపోయినా.. తెలంగాణలో ఆయనకున్న గుర్తింపు, పేరు తగ్గదు. పక్క రాష్ట్రాల్లో కొందరు నాయకులు చేసిన వ్యాఖ్యల వల్ల ప్రజాగ్రహానికి గురయ్యారు. అలాంటి ఉదాహరణలు మన కళ్ల ముందే ఉన్నాయి. కాబట్టి కేసీఆర్‌పై మాట్లాడేటప్పుడు కాస్త ఓపికతో మాట్లాడాలి. నేరుగా కేసీఆర్ ఏదైనా కామెంట్ చేస్తే.. దానికి సమాధానం చెప్పడం, కౌంటర్ ఇవ్వడం వరకు బాగానే ఉంటుంది. కానీ.. ఇతర బీఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు బదులుగా.. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తామనడం కరెక్ట్ కాదు అనేది నా అభిప్రాయం' ఆ సీనియర్ నేత చెప్పారు.

# అసెంబ్లీలో భూభారతి 2024 బిల్లు.. ప్రతిపక్షాల అభ్యంతరం

మొదటి పేజీ తరువాయి

హరీష్ రావు తమకు లిఖితపూర్వకంగా ఇచ్చిన సూచనలను కూడా బిల్లులో పొందుపరచామన్నారు. దొరల గడిల్లో కూర్చుని తయారుచేసిన 2020 చట్టాన్ని పూర్తిగా ప్రక్షాళన చేశామన్నారు. ముసాయిదా బిల్లును వెబ్‌సైట్‌లో పెట్టి 40 రోజులు అభిప్రాయాలు సేకరించామన్నారు. 33 జిల్లాల్లో ప్రజల అభిప్రాయాలు తీసుకొని కొత్త భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. కేసముద్రం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన దరావత్ రవి అనే బీఆర్ఎస్ ఎంపీటీసీ తన వద్దకు వచ్చారని.. ఆ గ్రామంలో సర్వే నంబర్ 149 నుంచి 160 లో ఉన్న భూమి ధరణి వచ్చాక అటవీ భూమిగా మార్చారని చెప్పారన్నారు. వారి స్థానిక ప్రజాప్రతినిదులకే ధరణి న్యాయం చేయలేదన్నారు. అలాంటి వారికి న్యాయం చేసేలా కొత్త చట్టం తీసుకువచ్చామని చెప్పారు. 18లక్షల ఎకరాలు పార్ట్ బిలో ఉందన్నారు. గతంలో ఆ భూమికి పాస్ బుక్కులు ఉంటే ఎందుకు పార్ట్ బి లో చేర్చారని ప్రశ్నించారు. కొత్త చట్టం ద్వారా పార్ట్ బి లోని భూముల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

అబాది, గ్రామ కంట భూములకు పరిష్కారాలు ఈ కొత్త చట్టంలో ఉన్నాయన్నారు. పొజిషన్‌కు, పాసుబుక్కులో ఉన్న భూ విస్తీర్ణ వ్యత్యాసాలను సరిచేసే అవకాశం ఉందన్నారు. మ్యుటేషన్‌పై అభ్యంతరాలు ఉంటే ఆర్డీవో ఆధ్వర్యంలో అప్పీల్ అథారిటీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వారసత్వ ఆస్తుల అభ్యంతరాలపై అప్పీల్ అథారిటీకి వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. క్రాస్ చెక్ చేసి మ్యూటేషన్ చేసే అధికారం ఆర్డీవోకి కొత్త చట్టంలో కల్పిస్తుందన్నారు. సభ్యుల నుంచి మంచి సూచనలు వస్తే ఈ బిల్లులో చేర్చడానికి తమకు ఎలాంటి బేషజాలు లేవని స్పష్టం చేశారు. ఎమ్మార్వో రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. ఆర్డీఓ, కలెక్టర్ అప్పీల్ అథారిటీగా ఉంటారన్నారు. ఆ తర్వాత అప్పీల్ చేసుకోవడానికి ఒక ట్రిబ్యునల్ కూడా ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. 2020 కి ముందు 9,24,000 సాధబైనామ దరఖాస్తులు చేసుకున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

## సమయం ఇవ్వండి : హరీష్ రావు

ఇప్పుడే బిల్లు ప్రవేశపెట్టి ఇప్పుడే చర్చ అంటే ఎలా అని ప్రశ్నించారు. బీఏసీ మినిట్స్ రాలేదని.. ఏ బిల్లు ఎప్పుడు వస్తుందో తెలియడం లేదని.. బిల్లు తమ చేతికి ఇంకా అందలేదన్నారు. బిల్లు తమ చేతికి రాకుండా బిల్లును చదవకుండా చర్చలో ఎలా పాల్గొంటామని ప్రశ్నిస్తూ.. బిల్లుపై చర్చకు సమయం ఇవ్వాలన్నారు. రెండు రోజుల ముందే బిల్లు ప్రతులను సభ్యులకు ఇవ్వాలని.. లేదంటే అభ్యంతరం తెలిపే హక్కు సభ్యులకు ఉంటుందన్నారు. "కనీసం ఒక్కరోజు ముందు కూడా బిల్లు పత్రాలు మాకు ఇవ్వలేదు మా ఇష్టం ఉన్నట్లు చేస్తామంటే మేం సభ నుండి వెళ్లిపోతాం" అని హరీష్ రావు తెలిపారు.

## రేపు చర్చ పెట్టండి..

"కొత్త ఆర్‌వోఆర్ బిల్లుపై రేపు చర్చ పెట్టండి. ఈరోజు మేము బిల్లును చదువుకుంటాం. రేపు మాకు బిల్లుపై మాట్లాడే అవకాశం ఇవ్వండి" అని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అనగా.. అర్ధరాత్రి అజెండా పంపించడం అంటే తమ హక్కులకు భంగం కలిగించినట్లే అని ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ వ్యాఖ్యలు చేశారు.




# మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సహా 24 మందికి బెయిల్

లఘుచర్లలో కలెక్టర్, ఉన్నతాధికారులపై దాడి ఘటన కేసులో రైతులకు బెయిల్ మంజూరు అయింది. దాడికి ప్లాన్ చేశారని ఆరోపణలు ఎదుర్కొంటున్న కొడంగల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పట్నం నరేంధర్ రెడ్డి సైతం బెయిల్ మంజూరు చేశారు. నాంపల్లి స్పెషల్ కోర్టు మొత్తం 24 మందికి బెయిల్ మంజూరు చేసింది. న్యాయమూర్తి వీరికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేశారు. పట్నం నరేందర్ రెడ్డి రూ.50 వేల పూచీకత్తు రెండూ సమర్పించాలని, రైతులు రూ.20 వేల పూచీకత్తూ సమర్పించాలని కోర్టు ఆదేశించింది.

వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లగచర్లలో కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులపై దాడి జరగడం సంచలనంగా మారింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డితో పాటు పలువురు రైతులను అరెస్ట్ చేసి విచారణ చేపట్టారు. దాదాపు నెలకు పైగా జైల్లోనే రైతులు, పట్నం నరేందర్ రెడ్డి ఉన్నారు. ఇటీవల రైతులకు బేడీలు అనే విషయం వివాదాస్పదమైంది. తెలంగాణ ప్రభుత్వం పై తీవ్రస్థాయిలో రాష్ట్రవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తాయి. పట్నం నరేందర్ రెడ్డి మూడు నెలలపాటు ప్రతి బుధవారం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

## గురువారం ఏ2 సురేష్ బెయిల్ పై విచారణ

ఈ కేసులో మొత్తం 26 మంది అరెస్ట్ కాగా 24 మందికి నాంపల్లి స్పెషల్ కోర్టు బెయిల్ ఇచ్చిందని న్యాయవాది జక్కుల లక్ష్మణ్ తెలిపారు. 3 నెలల వరకు పోలీసులు దర్యాప్తుకు సహకరించాలని ఆదేశిస్తూ పిడిపిపి కోర్టు నిందితులకు బెయిల్ మంజూరు చేసింది. ప్రతి బుధవారం పోలీస్ స్టేషన్ ముందుకు A1 మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి.. A2 సురేష్ కు బెయిల్ మంజూరు కాలేదు. గురువారం నాడు సురేష్ బెయిల్ పై వాదనలు జరగనున్నాయి.

కొడంగల్ ఫార్మా సిటీ కోసం లగచర్ల రైతుల భూములు సేకరించాలని ప్రభుత్వం ప్రయత్నాలు చేపట్టింది. అయితే తమ భూములు కోల్పోతామని రైతులు ఆందోళన చేపట్టారు. తమ భూముల్ని ఇచ్చే ప్రసక్తే లేదని ప్రభుత్వానికి సైతం పలుమార్లు తేల్చి చెప్పారు. ఈ క్రమంలో వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, పోలీస్ ఉన్నతాధికారులు లగచర్లకు వెళ్లగా.. రైతులు భూములు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని వారితో మాట్లాడాలని అధికారులను ఏ2 సురేష్ ఆహ్వానించారు. అది నిజమని నమ్మి లగచర్లకు వెళ్లిన అధికారులపై ఒక్కసారిగా దాడికి పాల్పడ్డారు. కలెక్టర్ సహా అధికారుల వాహనాలపై పెద్ద రాళ్లతో దాడి చేసి వాహనాలు ధ్వంసం చేశారు.

## రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేరు

అధికారులపై దాడి అంటే అది ప్రభుత్వంపై దాడి అని సీఎం రేవంత్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం ఆదేశాలతో పోలీసులు కేసు నమోదు చేసి మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని, రైతులను మొత్తం 26 మందిని అరెస్ట్ చేయగా కోర్టు రిమాండ్ విధించడంతో సంగారెడ్డి జైలులో విచారణ ఖైదీలుగా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు విడుదల చేసిన రిమాండ్ రిపోర్టులో కేటీఆర్ పేర్కొనడం కలకలం రేపింది. ప్రభుత్వాన్ని అస్థిరపరచే కుట్రలో భాగంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డి.. ఏ2 సురేష్ సాయంతో లగచర్ల రైతులను రెచ్చగొట్టారని పోలీసులు చెప్పారు. దాదాపు నెల రోజుల తరువాత ఇద్దరు మినహా మిగతా నిందితులకు కోర్టు బెయిల్ ఇచ్చింది.

# కష్టపడి చదువుకోండి

## - మీకు నేనున్నాను

## తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు హెచ్ ఎం ప్రభుదయాల్ భరోసా



భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ):కొత్తగూడెం మునిసిపాలిటి పరిధిలో గల రామవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఆయా కారణాలచే తండ్రిని కోల్పోయిన విద్యార్థులకు హెచ్.ఎం ప్రభుదయాల్, స్వెట్టర్,వస్త్రాలు అందజేసి చక్కగా చదువుకోవాలని సూచించారు. చదువుకు సంబంధించిన సామాగ్రి అందజేస్తానని భరోసా కల్పించారు.

# తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గా దిల్ రాజు (వెంకటరమణ రెడ్డి) ప్రమాణ స్వీకారం

మొదటి పేజీ తరువాయి

అనంతరం ఆయన మాట్లాడుతూ.. "తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. తెలుగు సినిమాకు పూర్వ వైభవం తీసుకురావాలి.. అందుకు అందరి సహకారం అవసరం. తెలంగాణ సంస్కృతి అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలుపుతున్నాను. తెలుగు సినీ పరిశ్రమకు మద్రాస్ నుంచి వచ్చిన తర్వాత గుర్తింపు వచ్చింది. ప్రపంచ వ్యాప్తంగా తెలుగు పరిశ్రమ ఇంకా అభివృద్ధి చెందాలి. ఈ విషయంలో తెలంగాణ ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా నాపై చాలా బాధ్యత ఉంది. ఫిల్మ్ ఇండస్ట్రీకి, ప్రభుత్వానికి మధ్యలో వారధిగా పనిచేసి.. సినీ పరిశ్రమలోని అన్ని విభాగాల సమస్యలతో పాటు డిస్ట్రిబ్యూటర్స్ సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తానని ఈ సందర్భంగా తెలియజేస్తున్నాను" అని చెప్పుకొచ్చారు.

డిసెంబర్ 18వ తేదీన తెలంగాణా ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కి వి. వెంకట రమణా రెడ్డి (దిల్ రాజు) అధ్యక్షులుగా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భముగా తెలుగు చలన చిత్ర పరిశ్రమ తరపున తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి హృదయ పూర్వక అభినందనలు తెలియజేస్తున్నామని ఓ లేఖను విడుదల చేసింది. దిల్ రాజుగారి నాయకత్వంలో తెలంగాణా రాష్ట్రంలో చలనచిత్ర పరిశ్రమ మరింత అభివృద్ధి చెందుతుందని విశ్వసిస్తున్నట్లుగా తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి అధ్యక్ష, గౌరవ కార్యదర్శులు ఈ లేఖలో పేర్కొన్నారు

# TGSRTC లో కొత్తగా ఉద్యోగాలు.. మంత్రి పొన్నం కీలక ప్రకటన

హైదరాబాద్,18 డిసెంబర్ (**క్రాంతి న్యూస్::**): మహాలక్ష్మీ పథకంలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం అందిస్తోన్న సంగతి తెలిసిందే. రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లకు ఎక్కడి నుంచి ఎక్కడికైనా జీరో టికెట్ ద్వారా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నారు. దీంతో బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రభుత్వం కొత్తగా బస్సు సర్వీసులు కూడా ఏర్పాటు చేసింది. కొన్ని రూట్లలో అదనపు బస్సు సర్వీసులను కూడా నడుపుతోంది. అయితే అదనపు బస్సులకు సరిపడా సిబ్బంది లేకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

ఈ నేపథ్యంలో ఆర్టీసీలో సిబ్బందిని రిక్రూట్ చేసుకోవాలని యాజమాన్యం భావిస్తోంది. ఇదే అంశంపై రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పలు వేదికల్లో రిక్రూట్‌మెంట్‌పై అప్డేట్ ఇచ్చారు. తాజాగా.. తెలంగాణ అసెంబ్లీలో ఆర్టీసీలో ఉద్యోగాల భర్తీపై కీలక ప్రకటన చేశారు. ఆర్టీసీలో కొత్తగా 3,039 ఉద్యోగాలను భర్తీ చేయనున్నట్లు మంత్రి పొన్నం అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. త్వరలోనే ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ద్వారా రద్దీ పెరిగిందని అందుకు అనుగుణంగా కొత్త బస్సులను కూడా కొనుగోలు చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు సిబ్బంది నియామకం ఉంటుందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు.

ఇక జిల్లా కేంద్రాలకు లింక్ బస్సులను ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. వేములవాడ, ధర్మపురి, కొండగట్టు క్షేత్రాలను కలుపుతూ బస్సుల లింకింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ఆవిర్భావం సమయంలో RTCలో 55,000 మంది ఉద్యోగులుంటే, ప్రస్తుతం 40,000 మంది ఉన్నారని చెప్పారు. త్వరలోనే ఖాళీలను భర్తీ చేయనున్నట్లు చెప్పారు. 15 ఏళ్లు దాటిన బస్సులను స్క్రాప్‌కు పంపిస్తున్నామని మంత్రి పొన్నం సభలో వెల్లడించారు. త్వరలోనే హైదరాబాద్ నగరంతో పాటుగా రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ బస్సులను నడపనున్నట్లు చెప్పారు.

మండల కేంద్రాల నుంచి జిల్లా కేంద్రాలకు జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ నగరానికి బస్సులను నడపనున్నట్లు చెప్పారు. జిల్లా కేంద్రాల నుంచి హైదరాబాద్ నగరానికి సూపర్ లగ్జరీ, డీలక్స్ బస్సులు నడుపుతామని మంత్రి పొన్నం గతంలోనూ ప్రకటించారు. ప్రభుత్వం చెప్పినట్లుగా కొత్త బస్సులు, సిబ్బంది నియాకం పూర్తయితే.. బస్సుల్లో రద్దీ తగ్గే ఛాన్స్ ఉంటుంది.



# కెసిఆర్ ని మించిన గజ దొంగ రేవంత్ రెడ్డి ...

- ROR చట్ట ఆమోదం ఆదివాసీలకు చీకటి రోజు..
- ఎల్ టి ఆర్ చట్టాన్ని బొంద పెట్టిన రేవంత్ రెడ్డి..
- జిఎస్పీ దీక్షకు మద్దతు ప్రకటించిన ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి...
- ఎల్ టి ఆర్ చట్ట విధ్వంస కారిగా నూతన ఆర్వో ఆర్ చట్టం..



క్రాంతి దినపత్రిక // నూగురు వెంకటాపురం ( డిసెంబర్ 18 ) : షెడ్యూల్డ్ చట్టాల పైన ఉక్కు పాదం మోపుతూ ఆదివాసీల భూమి హక్కును కాల రాస్తూ ఉన్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం పైన ఏ ఎన్ ఎస్ రాష్ట్ర అధ్యక్షులు కొర్స నర్సింహా మూర్తి మండిపడ్డారు. జీఎస్పీ ఆధ్వర్యంలో పూనెం సాయి చేపట్టిన రిలే నిరాహార దీక్షకు నర్సింహా మూర్తి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. దండ వేసి మూడో రోజు దీక్ష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పైన కీలక వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం బుధవారం అసెంబ్లీ లో ప్రవేశ పెట్టిన బిల్లు గిరిజనుల అస్థిత్వాన్ని బొంద పెట్టే విధంగా ఉందని అన్నారు. 2020 లో కేసీఆర్ తెచ్చిన భూ చట్టాన్ని షెడ్యూల్డ్ ఏరియాలో యదా తదంగా కొనసాగిస్తూ ఉన్నారని ధ్వజం ఎత్తారు. ఆనాడు ఎల్ టి ఆర్ చట్టాన్ని ఉల్లంఘించి గిరిజనేతరులకు ఇచ్చిన భూమి హక్కులకు కొనసాగింపు గా రైట్స్ ఆఫ్ రికార్డ్స్ చట్టం ఉందన్నారు. కెసిఆర్ నియంతృత్వ వారసత్వ విధానాన్ని రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజనుల అంత కాంగ్రెస్ పార్టీ పక్షాన నిలబడ్డారని తెలిపారు. కానీ రేవంత్ రెడ్డి గిరిజనులకు వెన్నుపోటు పొడిశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. నూతన భూ చట్టం లో గ్రామ కంఠ భూములకు, అక్రమంగా గిరిజనేతరుల సాగులో భూములకు హక్కులు షెడ్యూల్ ఏరియాలో కల్పించడం అంటే గిరిజనులను నయ వంచన చేయడమే అన్నారు.

ఈ బిల్లు, అప్పీల్ మరియు రివిజన్ అధికారుల ద్వారా విచారణల కోసం 1908 సివిల్ ప్రొసీజర్ కోడ్ ( CPC ) నుండి నిబంధనలను వర్తింపజేస్తుంది. అయితే షెడ్యూల్డ్ ప్రాంతాలకు సి.పి.సి. ( CPC ) వర్తించదు, ఇక్కడ సివిల్ వివాద విచారణ కోసం ఏజెన్సీ రూల్స్, 1924 అమలులో ఉన్నాయి అని తెలియజేసారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ప్రవేశ పెట్టిన ROR చట్టం బిల్లును తక్షణమే ఉప సంహరించు కోవాలని డిమాండ్ చేశారు. కొమరం భీమ్ కాలని ఆదివాసీలు సాగు చేసుకుంటున్న భూమి పైన కుట్ర చేసి ఆడవాళ్ళ పైన అత్యంత పాశవికంగా దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళల పైన దాడి చేస్తే ఏ ఒక్క రాజకీయ పార్టీ అండగా నిలవలేదన్నారు. వలస గిరిజనేతరులకు పదవులో ఇచ్చే రాజకీయకులు ఆదివాసీలను వలస వాదులు అనడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఆదివాసీలు ఈ దేశంలో ఎక్కడున్నా ఆదివాసీలే అన్నారు. సాగులో ఉన్న భూములను గుంజుకొని పల్లెప్రకృతి వనాన్ని ఏర్పాటు చేయడం లో గిరిజనేతరుల కుట్ర దాగి ఉందన్నారు. 145 సెక్షన్ తహసీల్దార్ పెట్టడం లో అంతర్యం ఏమిటన్నారు. గిరిజనేతరుల కబ్జాలో ఉన్న భూముల పైన 145 సెక్షన్ ఎందుకు పెట్టడం లేదో ఆదివాసీలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.పూనెం సాయి చేస్తున్న దీక్షను భగ్నం చేయాలని చూస్తే ఉపేక్షించేది లేదన్నారు. కొమరం భీమ్ ఆదివాసీలు చేస్తున్న పోరాటం న్యాయమైనది అన్నారు. తహసీల్దార్ స్పందించి ఆదివాసీలకు న్యాయం చేయాలన్నారు. నాయకులు మహేష్, రవి, ప్రజలు పాల్గొన్నారు

# జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ నందు ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

## సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొన్న జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్





భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో ,18 డిసెంబర్ (**క్రాంతి న్యూస్:**): హేమచంద్రపురం నందు గల జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో సెమీ క్రిస్మస్ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ పాల్గొన్నారు. జిల్లా ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయి మనోహర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఏఆర్ అధికారులు మరియు సిబ్బంది సమక్షంలో ప్రార్థనలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ముందుగా క్రైస్తవ సోదరులందరికి శుభాకాంక్షలు తెలియజేశారు.క్రిస్మస్ ఏసుక్రీస్తు జననానికి గుర్తుగా ప్రపంచవ్యాప్తంగా వందల కోట్ల మంది ప్రజలు జరుపుకునే మతపరమైన,సాంస్కృతిక పండుగ అని అన్నారు.ప్రతి ఏటా క్రిస్మస్ పండుగను క్రైస్తవులంతా అంగరంగ వైభవంగా జరుపుకుంటారని తెలిపారు.ఈ రోజు ఈ సెమీ క్రిస్మస్ వేడుకలలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.అన్ని మతాల ప్రజలు మతసామరస్యాన్ని పాటిస్తూ పండుగలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అనంతరం సెమీ క్రిస్మస్ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును కట్ చేసి అనందాన్ని పంచుకున్నారు.ఈ వేడుకలలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఆర్ఐలు నరసింహారావు, కృష్ణారావు, లాల్ బాబు మరియు ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడలతో స్నేహభావం పెరుగుతుంది



హసన్పర్తి ,18 డిసెంబర్ ( **క్రాంతి న్యూస్:**): హనంకొండ ఏసిపి దేవేందర్ రెడ్డి అన్నారు నగరంలో ఎస్వీఎస్ విద్యా సంస్థలు నిర్వహిస్తూ బుధవారం క్రికెట్ పోటీలు ప్రారంభం అయ్యాయి ఈ పోటీలు నాలుగు రోజులపాటు కొనసాగునున్నాయి ప్రారంభోత్స కార్యక్రమానికి ఏసిపి దేవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొనడం జరిగింది ఎస్వీఎస్ విద్యా సంస్థ చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్ రావు మాట్లాడుతూ క్రీడలతో శరీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం చేకూరుతుందన్నారు నాలుగు రోజులు నిర్వహించే పోటీల్లో 50 జట్లు పాల్గొంటున్నాయి ఈ కార్యక్రమంలో పోలీస్ ఇన్స్పెక్టర్ రవికుమార్ ఎస్సై రవీందర్ అధ్యాపకులు.విద్యార్థుల పాల్గొన్నారు

# ఆంధ్ర



## నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం..




నెల్లూరు,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో జికా వైరస్ కలకలం రేపింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ అనుమానిత కేసు నమోదైందన్న ప్రచారం కలకలం రేపుతోంది. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామంలో ఓ ఆరేళ్ల బాలుడు అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు బాలుడిని నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే ఆ బాలుడికి జికా వైరస్ సోకిందంటూ ప్రచారం మొదలైంది. ఈ ప్రచారంపై నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించేందుకు చెన్నై తరలించినట్లు చెప్పారు. మరోవైపు బాలుడికి సోకింది జికా వైరస్ అవునో కాదో తెలుసుకోవడం కోసం బాలుడి నుంచి రక్త నమూనాలను సేకరించి పుణె ల్యాబ్‌కు పంపించినట్లు మంత్రి చెప్పారు. వెంకటాపురం గ్రామానికి జీజీహెచ్ వైద్యులు, ప్రత్యేక వైద్య బృందాలు వెళ్లాయని చెప్పిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. బాలుడి కుటుంబసభ్యులతో పాటు, గ్రామస్థులకు వైద్యపరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. మరోవైపు వెంకటాపురం గ్రామంలో వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

### జికా వైరస్ ఎలా వస్తుంది?

జికా వైరస్ కేసులు సాధారణంగా బ్రెజిల్, అమెరికాలో కనిపిస్తుంటాయి. జికా వైరస్ అనేది చాలావరకూ మామూలు వైరస్ అయినా కూడా.. కొంతమందిలో సీరియస్ కావచ్చు. డెంగీ, చికెన్ గున్యా తరహాలోనే జికా వైరస్ కూడా దోమల ద్వారా వస్తుంది. ఈడిస్ జాతి దోమల ద్వారా జికా వైరస్ వ్యాపిస్తుంది. ఈ దోమలు ఎక్కువగా పగటి పూట కుడుతూ ఉంటాయి. జికా వైరస్ మామూలు వైరల్ జబ్బు అయినప్పటికీ ఒక్కోసారి గిలియన్ బ్యారీ సిండ్రోమ్‌కు దారి తీయవచ్చు. ఈ సిండ్రోమ్ కారణంగా కాళు తాత్కాలికంగా చచ్చుబడే ప్రమాదం ఉంది. అన్నింటి కంటే ముఖ్యంగా జికా వైరస్ గర్భిణులకు ఇబ్బందికరంగా మారుతుంది. గర్భస్థ శిశువుల్లో మెదడు ఎదుగుదలను దెబ్బతీస్తుంది. దీంతో గర్భిణులకు ఈ వైరస్ వస్తే.. వారికి పుట్టే శిశువులు చిన్న తలతో పుడతారని వైద్యులు చెప్తున్నారు.

### జికా వైరస్ లక్షణాలు

జికా వైరస్ లక్షణాల్లో జ్వరం ఒకటి. అయితే కొంతమంది స్వల్పంగా జ్వరగా రావచ్చు. అలాగే ఒళ్లునొప్పులు, కీళ్లనొప్పులు, తలనొప్పి ఉంటాయి. కళ్లు ఎర్రబడటం, చర్మం మీద దద్దుర్లు కూడా కనిపిస్తాయి. ఈడిస్ దోమ కుట్టిన మూడు నుంచి 14 రోజుల్లో దీని లక్షణాలు కనిపిస్తాయని వైద్యులు చెప్తున్నారు. అలాగే రెండు నుంచి వారం రోజుల్లో లక్షణాలు తగ్గిపోయే అవకాశం ఉందంటున్నారు.

### జికా వైరస్ వ్యాప్తి

జికా వైరస్ సోకిన వ్యక్తి లాలాజలంతో కూడా ఈ ఇన్‌ఫెక్షన్ వ్యాపించే అవకాశం ఉంది. జికా వైరస్ బాధితుడి రక్తం, వీర్యం, లాలాజలం ద్వారా ఇతరులకు వ్యాపించే అవకాశం ఉంది. జికా వైరస్‌ను గుర్తించడానికి పీసీఆర్ పరీక్ష చేస్తారు. అయితే లక్షణాలు కనిపించిన వారంలోపు అయితే కచ్చితమైన ఫలితాలు వచ్చే అవకాశం ఉందని వైద్యులు చెప్తున్నారు. జికా వైరస్ చికిత్స విషయానికి వస్తే ఇతరత్రా వైరల్ ఇన్‌ఫెక్షన్లకు చికిత్స చేసిన విధంగానే దీని చికిత్స ఉంటుంది. ప్రత్యేకమైన చికిత్స అంటూ ఏమీ లేదు.


## పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు. గొట్టిపాటి లక్ష్మి...

దర్శి,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): పదవులు, హోదాల కోసం తాను రాజకీయాల్లోకి రాలేదని దర్శి టిడిపి ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. దర్శి నియోజకవర్గంలో జరిగిన కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆమె మాట్లాడుతూ. ప్రజా సమస్యలు పరిష్కరించి దర్శిలో టిడిపి కి పూర్వ వైభవం తీసుకుని తెస్తా అన్నారు. ఈ కార్యక్రంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పరిటాల రవి హత్య కేసు నిందితులకు బెయిల్.. 18 ఏళ్ల తర్వాత జైలు నుంచి..

అమరావతి,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): టీడీపీ నేత, మాజీ మంత్రి పరిటాల రవి హత్య కేసులో నిందితులుగా ఉన్న ఐదుగురికి బెయిల్ మంజూరైంది. పరిటాల రవి హత్య కేసు నిందితులకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు బుధవారం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పరిటాల రవి హత్య కేసులో ఏ3గా ఉన్న పండుగ నారాయణరెడ్డి, ఏ4 రేఖమయ్య, ఏ5 బజన రంగనాయకులు, ఏ6 వడ్డే కొండ, ఏ8 ఓబిరెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులను సమర్పించాలని ఆదేశించింది. అలాగే నిందితులు ప్రతి సోమవారం పోలీస్ స్టేషన్‌లో హాజరు కావాలని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. సోమవారం ఉదయం 11 గంటలకల్లా స్టేషన్ హౌజ్ ఆఫీసర్ ఎదుట హాజరు కావాలని స్పష్టం చేసింది. చట్టానికి లోబడి వ్యవహరించాలని.. చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తే బెయిల్ రద్దు చేస్తామని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. 2005లో జరిగిన పరిటాల రవి హత్య అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ కేసులో నిందితులుగా ఉన్న ఈ ఐదుగురికి కింది కోర్టు శిక్ష విధించింది. గత 18 ఏళ్లుగా జైల్లోనే ఉన్నారు. అయితే కింది కోర్టు తీర్పుపై హైకోర్టులో అప్పీల్ చేశారు. అలాగే బెయిల్ కోరుతూ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. పరిటాల రవి హత్య కేసులో మొద్దు శీను అనే షూటర్ అరెస్ట్ కావటంతో తెలిసిన సంగతే. తన బావ సూరి కళ్లలో ఆనందం చూడటం కోసమే పరిటాల రవిని కాల్చానంటూ అప్పట్లో మొద్దు శీను మీడియా ముఖంగా ప్రకటించటం కూడా సంచలనం రేపింది. పరిటాల హత్యక కేసులో అరెస్టైన మొద్దు శీను అలియాస్ జూలకంటి శ్రీనివాస్ రెడ్డిని



2008లో మల్లెల ఓం ప్రకాశ్ అనే ఖైదీ జైల్లో హత్య చేశారు. మొద్దు శీను నిద్రపోతున్న సమయంలో తలపై డంబెల్‌తో బాది హత్య చేశాడు. ఆ తర్వాత ఓం ప్రకాశ్ సైతం 2020లో అనారోగ్యంతో చనిపోయాడు. ఇక పరిటాల రవి హత్య కేసులో ప్రధాన నిందితుడు మద్దెల చెరువు సూరి అలియాస్ గంగుల సూర్య నారాయణ రెడ్డి సైతం హత్యకు గురయ్యారు. భానుకిరణ్ అనే వ్యక్తి మద్దెల చెరువు సూరిని కాల్చి చంపారు. అనంతరం భానుకిరణ్‌ను పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఇటీవలే సుమారుగా నెలరోజుల క్రిందట మద్దెల చెరువు సూరి హత్య కేసు నిందితుడు భానుకిరణ్ కూడా జైలు నుంచి బెయిల్ మీద విడుదలయ్యారు.

## చైనా మోడల్ ఫాలో కానున్న ఏపీ

రాజమహేంద్రవరం,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): వ్యర్థాల నిర్వహణకు ఏపీ ప్రభుత్వం కొత్త ప్లాన్ వేసింది. చెత్త నుంచి సంపద సృష్టించాలనే సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాలకు అనుగుణంగా అధికారులు, మంత్రిత్వశాఖలు చర్యలు తీసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే చెత్త పేరుకుపోకుండా ఉండేందుకు చైనా తరహాలో విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని ఆలోచిస్తోంది. ఈ విషయాన్ని ఏపీ మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కార్యాలయంలో బుధవారం మంత్రి నారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మూడేళ్లలో అమరావతి పనులను పూర్తిచేస్తామని మంత్రి ప్రకటించారు. సీఆర్డీఏ సమావేశాల్లో ఇప్పటి వరకూ 45 వేల కోట్ల రూపాయల పనులకు అనుమతి ఇచ్చామన్న నారాయణ.. వచ్చే ఏపీ కేబినెట్ సమావేశంలో వీటికి ఆమోదం లభిస్తుందని చెప్పారు. ఆంధ్రుల కలల రాజధాని అయిన అమరావతి ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.62 వేలకోట్లు అని మంత్రి నారాయణ తెలిపారు. మూడేళ్లలో రాజధాని పనులు పూర్తి చేస్తామన్న మంత్రి నారాయణ.. అమరావతిలో ఐదు ఐకానిక్ టవర్లు, వంద ఎకరాల్లో అసెంబ్లీ భవనం, హైకోర్టు, అధికారుల నివాసాలు, రోడ్లు పూర్తిచేస్తామని చెప్పారు. అలాగే రాష్ట్రంలో వ్యర్థాల నిర్వహణకు ప్రత్యేక విధానం తీసుకువస్తామన్న నారాయణ.. చెత్త పేరుకుపోకుండా ఉండేందుకు చైనా తరహాలో విద్యుత్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యర్థాల నిర్వహణను గాలికి వదిలేసిందని నారాయణ విమర్శించారు. మరోవైపు 2014–19 మధ్య చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అప్పటి టీడీపీ సర్కారు నిర్ణయించింది.




అయితే 2019 ఎన్నికల్లో ఓటమి పాలవ్వటంతో ఆ దిశగా బలంగా అడుగులు పడలేదు. ఈ నేపథ్యంలోనే ఇటీవల పల్నాడు జిల్లాలో పర్యటించిన మంత్రి నారాయణ.. ఏపీలో త్వరలోనే చెత్త నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్లు నెలకొల్పనున్నట్లు చెప్పారు. త్వరలోనే కాకినాడ, నెల్లూరులో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వానికి చెత్త మీద పన్ను వేయడం తప్ప.. చెత్తను ఎలా నిర్వహించాలో తెలియదన్న నారాయణ.. తాము అధికారంలోకి రాగానే చెత్త పన్ను రద్దు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వ్యర్థాల నుంచి విద్యుత్ తయారీ ప్లాంట్ ద్వారా పారిశుధ్యంతో పాటుగా విద్యుత్ కూడా కలిసొస్తుందన్నారు.

## ఎమ్మెల్యే బూచేపల్లి ఆధ్వర్యంలో పాస్టర్ దంపతులకు దుస్తులు పంపిణీ.

దర్శి ,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ప్రకాశం జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి ఎమ్మెల్యే ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 20 వ తేది శుక్రవారం ఉదయం 10 గంటలకు దర్శి పొదిలి రోడ్ లోని బూచేపల్లి నిలయం నందు దర్శి నియోజకవర్గం లోని 5 మండలాల పాస్టర్ దంపతులకు దుస్తులు పంపిణీ కార్యక్రమం జరగనున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.




## గుంటూరు రచయితకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు



గుంటూరు,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): గుంటూరు జిల్లాకు చెందిన ప్రముఖ రచయిత, న్యాయవాది పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు దక్కింది. ' దీపిక ' అభ్యుదయ వ్యాస సంపుటికి గాను అవార్డు వచ్చింది. దేశవ్యాప్తంగా 21 భాషలకు గాను కేంద్ర సాహిత్య అకాడమీ అధ్యక్షుడు మాధవ్ కౌశిక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సాహిత్య అకాడమీ ఎగ్జిక్యూటీవ్ బోర్డు ఎంపికైన పుస్తకాల పేర్లను ప్రకటించింది. పెనుగొండ లక్ష్మీనారాయణ స్వగ్రామం పల్నాడు జిల్లా చెరువుకొమ్ముపాలెం. ఆయన గుంటూరులో న్యాయవాదిగా పనిచేస్తూ 1972 నుంచి అభ్యుదయ రచయిత సంఘం కార్యకర్తగా జిల్లా, రాష్ట్ర , జాతీయ స్థాయిలో పలు బాధ్యతలు నిర్వహించారు. గత ఏడాది జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి తెలుగు సాహితీవేత్తగా గుర్తింపు పొందారు .

అవార్డు గ్రహీతలకు వచ్చే ఏడాది మార్చి 8న ఢిల్లీలో పురస్కారాలను ప్రదానం చేయనున్నారు. నిర్వాహకులు ఈ అవార్డు కింద రూ. లక్ష నగదుతో పాటు శాలువాతో సన్మానం చేయనున్నారు. తెలుగు నుంచి మొత్తం 14 పుస్తకాలను జ్యూరీ సిఫారసు చేయగా పెనుగొండ లక్ష్మీనారాయణ రచించిన అభ్యుదయ సాహిత్య వ్యాస సంపుటి 'దీపిక 'కు అవార్డు దక్కింది. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సాహిత రంగంలో ఇచ్చే అత్యంత పురస్కారంలో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు రావడం గర్వకారణంగా ఉందని పేర్కొన్నారు.

## మంగళగిరి పానకాల స్వామి వారిని దర్శించుకున్న నరసరావుపేట ఎమ్మెల్యే డా॥చదలవాడ అరవింద బాబు




మంగళగిరి పానకాల స్వామి వారిని నరసరావుపేట ఎమ్మెల్యే డా॥చదలవాడ అరవింద బాబు దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఎమ్మెల్యే డా॥చదలవాడ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి ఎమ్మెల్యే డా॥చదలవాడ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డా॥చదలవాడతో పాటు ఆలయ ఈవో రామకోటి రెడ్డి, అర్చకులు ఉన్నారు.

## శ్రీశైలం మల్లన్న ఆలయానికి రూ. 5.96 కోట్ల ఆదాయం

శ్రీశైలం,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): నంద్యాల జిల్లా శ్రీశైలం మల్లన్న ఆలయంలో ఉభయ ఆలయాల హుండీ లెక్కింపు నిర్వహించారు. చంద్రవతి కళ్యాణ మండపంలో లెక్కింపు నిర్వహించగా రూ.5,96,92,376 కోట్లు ఆదాయం వచ్చిందని ఈవో శ్రీనివాసరావు వెల్లడించారు. ఈ ఆదాయాన్ని గత 26 రోజులులో కానుకల రూపంలో భ్రమరాంబ మల్లికార్జునస్వామి అమ్మవార్ల ఉభయ ఆలయాలు, పరివార దేవాలయాల హుండీలో వేశారని వివరించారు. ఈ హుండీ లెక్కింపులో నగదుతో పాటు 232 . 400 మిల్లి గ్రాముల బంగార , 7 కేజీల 850 గ్రాములు వెండిని భక్తులు కానుకగా వేశారని తెలిపారు. యూఎస్ఏ డాలర్లు 558, సౌదీఅరేబియా రియాల్స్ 3, ఓమన్ బైసా 200, కువైట్ దినార్ 12, కత్తారు రియాల్స్ 4, సింగపూర్ డాలర్లు 7 వచ్చాయని తెలిపారు. ఆస్ట్రేలియా డాలర్లు 60, కెనడా డాలర్లు 35, హాంకాంగ్ డాలర్లు 10, యూకే ఫౌండ్స్ 5, ఈరోస్ 115, కెన్యా షిల్లింగ్స్ 50, ఫిలిపిన్స్ పిసో 20, యూఏఈ దిర్హమ్స్ 15, జాంబియా క్వచ 20, జపాన్‌యన్స్ 1000 మొదలైన వివిధ దేశాల విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయని వెల్లడించారు.

## వైసీపీ పాలనలో జల్‌జీవన్ మిషన్ నిధులు దుర్వినియోగం- పవన్‌కల్యాణ్

శ్రీశైలం,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): గత వైసీపీ ప్రభుత్వ పాలనలో జల్‌జీవన్ మిషన్ కింద కేంద్రం విడుదల చేసిన రూ. 4వేల కోట్లు దుర్వినియోగానికి గురయ్యాయని ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆరోపించారు. జల్‌జీవన్ మిసన్ అమలుపై గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య విభాగం ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు.



నీటి వనరులు లేకుండానే గ్రామంలో నీటిపైపులు వేసి వృథాగా మార్చారని వైసీపీని మండిపడ్డారు. ప్రతి ఒక్కరికి సురక్షిత మంచినీరు అందించాలనే కేంద్ర ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని వెల్లడించారు. జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్రానికి రూ. 76 వేల కోట్లు మంజూరు చేయాలని కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి విన్నవించినట్లు తెలిపారు. రో జుకు కనీసం సగటున 55 లీటర్లు నీటిని ఇవ్వాలనేది ప్రధాని నరేంద్ర మోదీ కలని గుర్తు చేశారు. రాష్ట్ర వాటాను అడిగితే గత ప్రభుత్వం ఇవ్వకపోవడం వల్ల జల జీవన్ మిషన్ అమలు కాలేదని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చంద్రబాబు నాయకత్వంలో నీటి సరఫరాపై దృష్టి పెట్టామన్నారు.

మానవతా దృక్పధంతో అందరూ కలిసి పనిచేయాలని సూచించారు. పైపు లైన్లు డిజైన్‌లు కూడా గందరగోళంగా ఉన్నాయని తెలిపారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా శాశ్వతమైన పరిష్కారం చూడాలని కోరారు.

## ఆ గ్రామమంతా తేదాపానే..

దివంగత టీడీపీ నేత పరిటాల రవి స్వగ్రామమైన వెంకటాపురం సరికొత్త చరిత్ర సృష్టించింది. ఈ గ్రామంలోని ఓటర్లందరూ టీడీపీ సభ్యత్వం తీసుకుని చరిత్ర సృష్టించారు. గ్రామంలో మొత్తం 581 మంది ఓటర్లు ఉండగా... వీరిలో 11 మంది చనిపోయారు. మిగిలిన 570 మందిలో ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకున్నారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఈ రికార్డు సాధించిన ఏకైక గ్రామంగా వెంకటాపురం నిలిచిందని రాప్తాడు టీడీపీ ఎమ్మెల్యే పరిటాల సునీత చెప్పారు. 100 శాతం సభ్యత్వం నమోదు కావడం పట్ల ఆమె సంతోషం వ్యక్తం చేశారు.



# కోటప్పకొండ - విశ్వబ్రాహ్మణులు

విశ్వబ్రాహ్మణ వంశీయులు కి కోటప్పకొండ కి ఒక ప్రత్యేక అనుభంద చరిత్ర ఉన్నది.పలనాడు జిల్లాలోని కోటప్పకొండ క్షేత్రం శివరాత్రి తిరునాల్లకి ప్రతేకముగా ప్రభలు ఊరేగింపు గా అద్భుతం గా అలంకరణ తో వస్తాయి.


ఈ ప్రభలు కోటప్పకొండ చుట్ట పక్కల ఉన్న పల్లెటూర్లలోని విశ్వబ్రాహ్మణ వంశీయులు చేత ఆయా గ్రామస్తులు పెద్దలు తయారు చేయిస్తారు.

వినుకొండ దగ్గర ఉన్న కనుమర్లపూడి లోని విశ్వబ్రాహ్మణ వంశీయులు వీరయ్యచార్యులు, శరభయ్యా చార్యులు గారి చేత నిర్మాణం అయిన ప్రభ చూడడానికి ప్రజలు రెండు వరుసల్లో బార్లు తీరేవారు.వీరు కొండ వద్ద బొమ్మల నెలవు నిర్వహణ చేసేవారు. అంగి, మంగి అని రెండు మర బొమ్మలు అనగా ఈనాడు మనం ఇంజనీరింగ్ వారు చెప్పుకునే రోబోట్లు తయారు చేసి ప్రదర్శన చేసేవారు. ఆంగి సర్పంచ్ గారు కరణం గారు వచ్చారు కుర్చీ వెయ్యి అని అంటే మంగి కుర్చీ తెచ్చి వేసేది.అటువంటి మర బొమ్మలు కనుమర్ల పూడి విశ్వబ్రాహ్మణ వంశీయులు విజ్ఞాన ప్రదర్శనకి ప్రజలు ఆశ్చర్య పోయేవారు.చరిత్ర లో ఆయుర్వేద వైద్యం చేసే సిద్దనాగర్జునచార్యులు ఒకరు.వీరి వంశం వారే సిద్దు ఇంటిపేరు ఉన్న విశ్వబ్రాహ్మణ వంశీయులు.ఈ సిద్దు ఇంటిపేరు కలిగిన కోటయ్యచార్యులు వారు ఈ కోటప్పకొండ క్షేత్రం ఆలవాలంగా తపస్సు చేసినారు.వీరి శివ ఉపాసకులు ఆనాటి నరసరావుపేట జమీందారు గారికి భార్య గారికి వచ్చిన కడుపు నొప్పి దోష నివారణ కోసం ఆయుర్వేద చికిత్స ఎన్నో ప్రాంతాల్లో చూపించి విసిగి పోయిన జమీందారు గారు కోటప్పకొండ లో ఉండే సిద్దు కోటయ్యచార్యులు గారి వైద్యం వలన నయం అయ్యింది.కోటయ్య చార్యులు గారికి గోంగూర మాన్యం అనే పేరు తో సుమారు వందల ఎకరాల మాన్యం ఇచ్చారు.ఆ కోటయ్యచార్యులు గారి సమాధి లింగం కోటేశ్వర లింగం అయ్యింది.అక్కడ ఉండే లింగములలో ఎది సమాధి లింగం అనేది పరిశోదన చేయాలి.సహజముగా చేదుకో కోటయ్య ఆదుకో కోటయ్య అనే పేరు ఆ ఆయుర్వేద వైద్యము వారి నామమే అయితే శివుడు చెవిటి వాడని బిగ్గరగా చెప్పలి అని కాలక్రమేణా ఇలా మారింది.వారి సంతానం కూడా అదే రీతిన సమాధి చెందారు.ఇప్పుడు దక్షిణా మూర్తి దేవాలయం గా మారిపోయింది.శిల్ప శాస్త్రములో ఎక్కడ కూడా లింగ రూపములో దక్షిణ మూర్తి లేదు కానీ ఇక్కడ లింగ రూప దక్షిణ మూర్తి అని అంటున్నారు.

పక్కన ఉన్న గొనేపుడి లో ఉండే ప్రముఖ శిల్పి గారు అయిన సిద్దు వెంకటేశ్వర్లు గారికి ఈ చరిత్ర తెలుసు.ఆ రోజుల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఇద్దరు అంటే ఇద్దరు శిల్పులపనితనానికి ప్రతిభకు నిదర్శనంగా ఇందిరాగాంధి గారి చేత సత్కారం పొందినారు.వారిలో ఒకరు సిద్దు వెంకటేశ్వర్లు గారు.ఈయనకు వివాహం కాలేదు చివరి రోజుల్లో విటంరాజుపల్లె లో కాలం గడిపారు. కోటప్పకొండ మెట్ల పక్కన ఉన్న విశ్వబ్రాహ్మణ సత్రం మొదటిగా బల్లికుర్వ మండల ముక్తేశ్వరం గ్రామానికి చెందిన కుందుర్తి శరభమ్మ గారు సుమారు 1000 రూపాయల వ్యయముతో పామర్తి నాగభూషణ శర్మ గారు పౌరోహిత్య ఆధ్వర్యం లో నెలకొల్పబడినది.

ప్రతి దేవాలయం కు విశ్వకర్మ వంశీయులు కి కచ్చితంగా సంబంధం ఉంటుంది కాలక్రమేణా కోటప్పకొండ లోని విశ్వకర్మ వంశీయుల యొక్క అసలు చరిత్ర మరుగున పడి పోయింది.ఈనాటికీ కూడా పూర్వకాలపు జానపద సాహిత్యం లో ఈ విషయాలు చెప్పేవారు.చరిత్ర గ్రంధస్తం చేసే నాటికి తారుమారు అయ్యియి.ఆనాటి వారికి ఈ విషయాలు తెలిసిన విశ్వబ్రాహ్మణ అన్న విషయాలు తీసివేసి చరిత్రలు రాశారు.దాచేపల్లి వాస్తవ్యులు స్వర్ణ సుబ్రమణ్య కవి గారు ఈ విషయములు పైన పరిశోధన చేశారు.

విశ్వబ్రాహ్మణ వంశీయులు ఎన్నో చరిత్రలు పోగొట్టుకున్న వాటిలో ఇది ఒకటి.విశ్వబ్రాహ్మణులు లేని చోట కథలు చెప్పండి అనే నానుడి సమాజములో ఉండేది అంటే అంత తార్కికంగా విమర్శకంగా నిజ నిర్దారణ ఆలోచన చేసే వారు.ఈనాడు ఆ కథల వినుటకే అలవాటు పడ్డారు ఆ తార్కిక జ్ఞానం కొరవడింది



# మందు లేని జీవితం

1. త్వరగా నిద్రపోవడం మరియు త్వరగా మేల్కొలపడం ఔషధం.
2. ఓం జపించడం ఔషధం.
3. యోగా ప్రాణాయామం ధ్యానం మరియు వ్యాయామం ఔషధం.
4. ఉదయం మరియు సాయంత్రం నడక కూడా ఔషధం.
5. ఉపవాసం అన్ని వ్యాధులకు ఔషధం.
6. సూర్యకాంతి కూడా ఒక ఔషధం.
7. కుండ నీరు తాగడం కూడా ఔషధమే.
8. చప్పట్లు కొట్టడం కూడా ఔషధమే.
9. ఆహారాన్ని పూర్తిగా నమలడం కూడా ఔషధమే.
10. ఆహారంలాగే, నీరు నమలడం మరియు త్రాగే నీరు కూడా ఔషధం.
11. ఆహారం తీసుకున్న తర్వాత వజ్రాసనంలో కూర్చోవడం ఔషధం.
12. సంతోషంగా ఉండాలనే నిర్ణయం కూడా ఒక ఔషధం.
13. కొన్నిసార్లు మౌనం కూడా ఔషధం.
14. నవ్వు మరియు జోకులు ఔషధం.
15. సంతృప్తి కూడా ఔషధం.
16. మనశ్శాంతి మరియు ఆరోగ్యకరమైన శరీరం కూడా ఔషధం.
17. నిజాయితీ మరియు సానుకూలత ఔషధం.
18. నిస్వార్థ ప్రేమ కూడా ఒక ఔషధం.
19. అందరికీ మంచి చేయడం కూడా ఔషధమే.
20. ఎవరికైనా దీవెనలు కలిగించే పని చేయడం ఔషధం.
21. అందరితో కలిసి జీవించడం ఔషధం.
22. తినడం, త్రాగడం మరియు కుటుంబంతో కలిసి ఉండడం కూడా ఔషధమే.
23. మీ ప్రతి నిజమైన మరియు మంచి స్నేహితుడు కూడా డబ్బు లేని పూర్తి మెడికల్ స్టోర్.
24. సంతోషంగా ఉండండి, బిజీగా ఉండండి, ఆరోగ్యంగా ఉండండి మరియు సంతోషకరమైన మనస్సును కలిగి ఉండండి, ఇది కూడా ఔషధం.
25. ప్రతి కొత్త రోజును సంపూర్ణంగా ఆస్వాదించడం కూడా ఔషధమే.
26. చివరగా... ఈ సందేశాన్ని ఎవరికైనా ప్రసాదంగా పంపడం ద్వారా ఒక మంచి పని చేయడంలో కలిగే ఆనందం కూడా ఒక ఔషధం.

ప్రకృతి యొక్క లి"గొప్పతనం"లిని అర్థం చేసుకోవడం మరియు దాని పట్ల కృతజ్ఞతా భావాన్ని కలిగి ఉండటం కూడా ఔషధం.

ఈ మందులన్నీ మీకు పూర్తిగా ఉచితంగా లభిస్తాయి.



## నెల్లూరు జిల్లాలో జికా వైరస్ కలకలం..

నెల్లూరు,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): ఆంధ్రప్రదేశ్‌లో జికా వైరస్ కలకలం రేపింది. శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జికా వైరస్ అనుమానిత కేసు నమోదైందన్న ప్రచారం కలకలం రేపుతోంది. నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం వెంకటాపురం గ్రామంలో ఓ ఆరేళ్ల బాలుడు అనారోగ్యానికి గురయ్యాడు. కుటుంబసభ్యులు బాలుడిని నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అయితే ఆ బాలుడికి జికా వైరస్ సోకిందంటూ ప్రచారం మొదలైంది. ఈ ప్రచారంపై నెల్లూరు జిల్లాకు చెందిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పందించారు. బాలుడికి మెరుగైన వైద్యం అందించేందుకు చెన్నై తరలించినట్లు చెప్పారు.

మరోవైపు బాలుడికి సోకింది జికా వైరస్ అవునో కాదో తెలుసుకోవడం కోసం బాలుడి నుంచి రక్త నమూనాలను సేకరించి పుణె ల్యాబ్‌కు పంపించినట్లు మంత్రి చెప్పారు. వెంకటాపురం గ్రామానికి జీజీహెచ్ వైద్యులు, ప్రత్యేక వైద్య బృందాలు వెళ్లాయని చెప్పిన మంత్రి ఆనం రామనారాయణరెడ్డి.. బాలుడి కుటుంబసభ్యులతో పాటు, గ్రామస్థులకు వైద్యపరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని అన్నారు. మరోవైపు వెంకటాపురం గ్రామంలో వైద్య శిబిరం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిసింది.




## హెూంగార్డులకు బిగ్ రిలీఫ్.. హైకోర్టు కీలక ఆదేశాలు

అమరావతి,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): ఏపీ కానిస్టేబుల్స్ నియామక ప్రక్రియలో హెూంగార్డులకు బిగ్ రిలీఫ్ అని చెప్పొచ్చు. కానిస్టేబుళ్ల భర్తీ ప్రక్రియలో హెూంగార్డులను ప్రత్యేక కేటగిరీగా గుర్తించాలంటూ ఏపీ హైకోర్టు ఆదేశించింది. ఆరువారాల్లోగా ప్రత్యేక మెరిట్ జాబితా సిద్ధం చేయాలంటూ ఏపీ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశించింది. కానిస్టేబుళ్ల భర్తీ ప్రక్రియలో తమను ప్రత్యేక క్యాటగిరీగా పరిగణించాలంటూ భారీ సంఖ్యలో హెూంగార్డులు హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్ల మీద విచారణ చేపట్టిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డిసెంబర్ మూడో తేదీన తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా వెల్లడించింది.

## జమిలి ఎన్నికల జేపీసీలో ముగ్గురు తెలుగు ఎంపీలు.

న్యూస్ డెస్క్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): జమిలి ఎన్నికలకు సంబంధించి కేంద్రం జాయింట్ పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసింది. 21 మంది లోక్‌సభ ఎంపీలు, 10 మంది రాజ్యసభ ఎంపీలు సహా మొత్తం 31 మందితో జేపీసీని నియమించింది. ఒకే దేశం ఒకే ఎన్నికకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లుకు సంబంధించి ఈ కమిటీ.. బిల్లులను పరిశీలించనుంది. ఈ 31 మంది ఎంపీల్లో ముగ్గురు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఎంపీలు ఉండటం గమనార్హం. ఇక ఈ జేపీసీ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్.. గురువారం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు.

పీపీ చౌధరీ ఛైర్మన్‌గా ఈ కమిటీని ఏర్పాటు చేసింది. వీరిలో ఏపీకి చెందిన బీజేపీ ఎంపీ , సీఎం రమేష్, తెలుగుదేశం ఎంపీ హరీష్ బాలయోగి, జనసేన ఎంపీ వల్లభనేని బాలశౌరిలకు అవకాశం కల్పించారు. ఇక కాంగ్రెస్ పార్టీ తరఫున ప్రియాంక గాంధీ వాద్రా పేరును ప్రకటించారు. ఇక ఇందులో కేంద్ర మాజీ మంత్రి సుష్మా స్వరాజ్ కుమార్తె బన్సూరీ స్వరాజ్‌కు చోటు కల్పించారు. అంతేకాకుండా మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ షిండే కుమారుడు డాక్టర్ శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండేకు అవకాశం దక్కింది.



# క్యాన్సర్ కు విరుగుడు

- క్యాన్సర్ టీకాపై పరిశోధనల్లో కీలక ముందడుగు
- వ్యాక్సిన్ తయారుచేసినట్టు ప్రకటించిన రష్యా
- జనవరి 2025 నుంచి దేశంలో పౌరులకు ఉచిత టీకా




న్యూస్ డెస్క్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): క్యాన్సర్‌పై ఔషధాలపై పరిశోధనల్లో కీలక ముందడుగు పడింది. ప్రపంచాన్ని భయపెడుతోన్న క్యాన్సర్ భూతానికి టీకాతో చెక్ పెట్టేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించినట్టు తాజాగా రష్యా ప్రకటించింది.క్యాన్సర్ కు టీకాను అభివృద్ధి చేసినట్టు వెల్లడించిన రష్యా.. వచ్చే ఏడాది మార్కెట్‌లోకి తీసుకొస్తున్నట్టు తెలిపింది. ముందుగా తమ దేశ పౌరులకు ఉచితంగా అందజేయనున్నట్టు వెల్లడించింది. ఈ మేరకు రష్యా ఆరోగ్య శాఖ మంత్రి ధ్రువీకరించారు. జనవరి 2025 నుంచి పౌరులకు వ్యాక్సినేషన్ ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. రష్యా అధికారిక మీడియా TASS ప్రకారం.. రేడియాలజీ మెడికల్ రిసెర్చ్ సెంటర్ డైరెక్టర్ జనరల్ ఆండ్రీ కప్రిన్ కేన్సర్ టీకా గురించి వివరాలను వెల్లడించారు.

గమలేయా రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ అలెగ్జాండర్ గింట్స్‌బర్గ్ గతంలో టీకా గురించి మాట్లాడుతూ.. ఈ వ్యాక్సిన్ కేన్సర్ వ్యాప్తిని నిరోధించగలదని తెలిపారు. క్యాన్సర్ వ్యాప్తిని నిరోధించగలదని అన్నారు. ఈ టీకాను తొలుత కేన్సర్ బాధితుల చికిత్సలో వినియోగించిన తర్వాత.. సాధారణ ప్రజలకు అందజేస్తామని చెప్పారు. అన్ని రకాల కేన్సర్లపై ఇది సమర్ధవంతంగా పనిచేస్తుందని అన్నారు.

టీకా పనితీరును నేషనల్ మెడికల్ రిసెర్చ్ రేడియోలాజికల్ సెంటర్, గమలేయా ఇన్‌స్టిట్యూట్ సహా రష్యా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ధ్రువీకరించాయి. అయితే, టీకా ఎటువంటి కేన్సర్ల చికిత్సకు తోడ్పడుతుంది? ప్రభావం ఏ మేరకు ఉంటుంది? దాని పేరు స్పష్టంగా చెప్పలేదు. కేన్సర్ వ్యాధికి శాస్త్రీయంగా టీకా అభివృద్ధి సాధ్యమే అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఇప్పటికే చాలా దేశాలు ఈ పరిశోధనల్లో నిమగ్నమయ్యాయి. ఈ క్రమంలో రష్యా అందరి కంటే ఓ అడుగు ముందే ఉంది.. ఇక, కరోనా సమయంలో కోవిడ్-19 టీకాను ప్రపంచంలో తొలిసారి రష్యాయే అందుబాటులోకి తీసుకొచ్చింది.

కొద్ది రోజుల కిందట రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ జాతినుద్దేశించి ప్రసంగిస్తూ.. కేన్సర్‌ను నిరోధించే కొత్త టీకాలు, ఔషధాల అభివృద్ధి ఎంత దూరంలో లేదని తెలిపారు. కాగా, కృత్రిమ మేధ వినియోగం కేన్సర్ టీకాల తయారీకి అవసరమైన కంప్యూటింగ్ విధానాన్ని తగ్గించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ఈ ఏడాది ఫిబ్రవరిలో డబ్ల్యూహెచ్‌ఓ విడుదల చేసిన నివేదిక ప్రకారం..అత్యధిక మానవాభివృద్ధి సూచీ (హెచ్‌డీఐ) దేశాల్లో కేన్సర్ పెరుగుదల అత్యధికంగా (4.8 కోట్లు) ఉండే అవకాశం ఉంది. తక్కువ హెచ్‌ఐడీ దేశాల్లో 142 శాతం, మధ్యస్థ హెచ్‌డీఐ దేశాల్లో 99 శాతం పెరుగుదలకు అవకాశం ఉందని అధ్యయనం పేర్కొంది. అంతేకాదు, తక్కువ, మధ్యస్థ హెచ్‌డీఐ దేశాల్లో దీని మరణాలు రెట్టింపు అయ్యే అవకాశం ఉందని కూడా ఆందోళన వ్యక్తం చేసింది.

## బ్యాటరీ మింగేసిన 10 నెలల బాలుడు..

- ఎండోస్కోపీ ద్వారా బయటకు తీసిన వైద్యులు
- తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో ఘటన



అమరావతి,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): కడుపులో ఉన్నప్పుడు మాత్రమే కాదు.. బిడ్డ పుట్టిన తర్వాత కూడా తల్లిదండ్రులు ఎన్నో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు చెప్తుంటారు. మరీ ముఖ్యంగా మోకాళ్లపై నడిచే సమయంలోనూ, ఐదేళ్ల వయసు వరకూ వారిని ఓ కంట కనిపెడుతూనే ఉండాలి. ఎందుకంటే తెలిసీ తెలియని వయసు.. అన్నీ కొత్తగా అనిపిస్తూ ఉంటాయి. ఏది తాకాలో.. ఏది తాకకూడదో.. ఏది తినాలో.. ఏది తినకూడదో గుర్తించలేని వయసు వారిది. అందుకే ఇంట్లో చిన్నపిల్లలు ఉంటే మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు చెప్తుంటారు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తిలో జరిగిన ఘటన ఈ అవసరాన్ని మరోసారి గుర్తు చేసింది.

శ్రీకాళహస్తిలో ఓ పదేళ్ల పిల్లాడు.. ఆడుకుంటూ బ్యాటరీ మింగేశాడు. వాచ్‌లలో ఉపయోగించే బ్యాటరీ సెల్‌ను చిన్నారి మింగేశాడు. అయితే ఈ విషయాన్ని ఇంట్లోని తల్లిదండ్రులు వెంటనే గుర్తించారు. తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రికి చిన్నారిని తీసుకెళ్లారు. స్విమ్స్ ఆస్పత్రిలోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం డాక్టర్లు ఎక్స్‌రే తీయగా.. చిన్నారి పొట్టలో బ్యాటరీ సెల్ కనిపించింది. దీంతో ఎండోస్కోపీ ద్వారా ఆ బ్యాటరీ సెల్‌ను వైద్యులు బయటకు తీశారు. దీంతో చిన్నారికి గండం తప్పింది. ప్రస్తుతం బాలుడు కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. అయితే చిన్నారి కుటుంబసభ్యులు వెంటనే గుర్తించడంతో ప్రమాదం తప్పిందని స్విమ్స్ వైద్యులు తెలిపారు. ఆలస్యం చేస్తే ప్రాణాపాయం ఎదురయ్యే అవకాశం ఉండేదన్నారు.

# తెలంగాణ కొత్త టూరిజం పాలసీ..

- మహిళల భద్రతకు పెద్దపీట
- సేఫ్టీకి ప్రత్యేక పోలీసు యూనిట్లు



హైదరాబాద్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): మహిళా పర్యాటకులకు భద్రత విషయంలో ఏ మాత్రం రాజీ పడకుండా టూరిజం ఫ్రెండ్లీ ఇండెక్స్(TFI) ద్వారా భద్రతా ప్రమాణాలను పెంపొందించాలని ప్రభుత్వం భావిస్తోంది. అన్ని పర్యాటక ప్రాంతాలలో సీసీ కెమెరాల నిఘా ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదించారు.ఇక శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిసరాల్లో 1-2 గంటల ప్రయాణ దూరంలో ఐకానిక్ ప్రాజెక్టులను ఏర్పాటు చేయాలని ప్లాన్ చేస్తున్నారు. గోదావరి, కృష్ణానది పర్యాటకాన్ని అభివృద్ధి చేసేందుకు హౌజ్ బోట్స్, వాటర్ స్పోర్ట్స్, వాటర్ కార్నివల్స్ ఉండేలా 'రివర్ ఫెస్టివల్స్'ను ప్రారంభించాలని భావిస్తున్నారు. వారసత్వ కట్టడాలు, కోటలు, ప్యాలెస్‌లు, సమాధులు, పర్యాటక ఆస్తుల పరిరక్షణ కోసం కార్పొరేట్ సంస్థలు వాటిని దత్తత తీసుకోవడానికి ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. రీజినల్ రింగు రోడ్డు గుండా డ్రై పోర్టుల అభివృద్ధితో పాటు గ్రీన్ ఫీల్డ్ హైవే నుంచి మచిలీపట్నం పోర్టుతో అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు.

పబ్లిక్, ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ ఆధారంగా ఔటర్ రింగ్ ఎగ్జిట్ పాయింట్స్ గుండా లగ్జరీ బ్రాండెడ్ మాల్స్, ఫ్యాక్టరీ ఔట్‌లెట్స్‌ను డెవలప్ చేయాలని చూస్తున్నామన్నారు. రాష్ట్రంలో కొత్త ఐకానిక్ ప్రాజెక్టులను అభివృద్ధి చేయటం, ఆధ్యాత్మిక ప్రదేశాలు, బౌద్ధ ప్రదేశాలు, టెంపుల్ టూరిజాన్ని ప్రోత్సహిస్తామన్నారు. అన్ని ప్రత్యేక పర్యాటక ప్రాంతాల్లో హెలిప్యాడ్‌లను కూడా అభివృద్ధి చేయనున్నట్లు మంత్రి జూపల్లి వెల్లడించారు. కొత్త టూరిజం పాలసీల అమలుకు కమిటీలు వేయనున్నట్లు చెప్పారు.

# పురపాలక సంఘ సాధారణ కౌన్సిల్ సమావేశం

హుస్నాబాద్ ,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్ ): సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పురపాలక సంఘ కార్యాలయంలో పురపాలక సంఘ పాలక సభ్యుల సాధారణ సమావేశము కౌన్సిల్ హాలులో చైర్ పర్సన్ ఆకుల రజిత అధ్యక్షతన ఏర్పాటు చేసినారు. ఇట్టి సాధారణ సమావేశములో పట్టణ అవసరాలకు సంబంధించిన పలు అంశాలు చర్చించినారని, ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ పట్టణములో మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పైప్ లైన్ లు, స్టార్టర్లు, గెట్ వాల్వ్ మరియు మోటర్ల రిపేర్ పనుల కొరకు 2024-25 సంవత్సరంనకు నాలుగు లక్షల తొంబై వేల రూపాయలు కేటాయించుటకు,పట్టణమలో ఎల్లమ్మ చెరువు ఊర కాలువలో ఉన్న ముళ్ల పొదలు, రాళ్ళ కుప్పలను ఇటాచి ద్వారా తొలగించుటకు మూడు లక్షల తొంబై ఆరు వేల రూపాయలు,ఆర్టిఓ కార్యాలయం వద్ద ఉన్న వైకుంఠదామము మూడు సంవత్సరాలు రోజు వారి నిర్వహణ కొరకు ఆది జాంబవ మాదిగ సంక్షేమ సంఘమునకు ఇచ్చుటకు గాను మరియు పలు అంశాలు పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేస్తూ మొత్తం (26) అంశాలకు కౌన్సిల్ ఆమోదిస్తూ తీర్మానించినారన్నారు.ఇట్టి కౌన్సిల్ సమావేశంలో వైస్ చైర్మన్ అయిలేని అనిత, కౌన్సిలర్లు కొంకట నళిని దేవి, బోజు రమా దేవి,పెరుక భాగ్య రెడ్డి, వున్న లావణ్య, చిత్తారి పద్మ,వేణు మ్యాదరబోయిన, గోవిందు రవి,దొడ్డి శ్రీనివాస్, బొల్లి కల్పన,భూక్య సరోజన, జనగాం రత్న,వల్లపు రాజు, బొజ్జ హరీష్, వాల సుప్రజ కో ఆప్షన్ సభ్యులు ఎండి.ఆయుబ్,అయిలేని శంకర్ రెడ్డి,కాశబోయిన లలిత, బొల్లం శ్రీలత కమీషనర్ టి. మల్లికార్జున్ మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.





# ఆరోగ్య క్రాంతి

# రేగు పండ్లను తింటే ఇన్ని లాభాలా..

హెల్త్ న్యూస్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): చలికాలం మొదలైందంటే చాలు మనకు రేగు పండ్లు ఎక్కువగా కనిపిస్తుంటాయి. రహదారుల పక్కన బండ్లపై రేగు పండ్లను ఎక్కువగా విక్రయిస్తుంటారు. వీటినే జుజుబి పండ్లని కూడా అంటారు. ఈ పండ్లు కాయలుగా ఉన్నప్పుడు వగరుగా ఉంటాయి. అదే పండితో మాత్రం తియ్యగా ఎంతో రుచిగా ఉంటాయి. ఈ చెట్లు 5 నుంచి 7 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతాయి. ఆసియాలోని అనేక ప్రాంతాల్లో ఈ చెట్లు పెరుగుతాయి. వీటినే ఇండియన్ డేట్స్ అని కూడా పిలుస్తారు. ఈ పండ్లను ఈ సీజన్‌లో తినడం వల్ల అనేక లాభాలు కలుగుతాయి. రేగు పండ్లలో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. కనుక సీజనల్‌గా లభించే రేగు పండ్లను తినడం వల్ల మనం అనేక లాభాలను పొందవచ్చు. అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఈ పండ్లను తింటే ఫైబర్ సమృద్ధిగా లభిస్తుంది. అలాగే ప్రోటీన్లు కూడా వీటిల్లో సమృద్ధిగానే ఉంటాయి. ఇవి బరువును తగ్గించడంలో సహాయం చేస్తాయి.

షుగర్ తగ్గుతుంది, నిద్ర పడుతుంది..

రేగు పండ్లను తినడం వల్ల క్యాలరీలు తక్కువగా లభిస్తాయి. పైగా వీటిల్లో ఉండే ఫైబర్ ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయకుండా చేస్తుంది. దీంతో అధిక బరువును తగ్గించుకోవడం తేలికవుతుంది. అలాగే షుగర్ ఉన్నవారు ఈ పండ్లను తింటే షుగర్ లెవల్స్‌ను తగ్గించుకోవచ్చు. డయాబెటిస్ ఉన్నవారికి రేగు పండ్లు ఎంతో మేలు చేస్తాయి. డయాబెటిస్‌ను నియంత్రించుకునేందుకు దోహదపడతాయి. రేగు పండ్లను తినడం వల్ల శరీరంలోని కొవ్వు కరిగిపోతుంది. పొట్ట దగ్గరి కొవ్వు తగ్గి ఆరోగ్యంగా ఉంటారు. ఈ పండ్లలో న్యూరో ప్రొటెక్టివ్ గుణాలు ఉంటాయి. అందువల్ల ఇవి నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో ఆందోళన, కంగారు వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత కలుగుతుంది. దీంతో నిద్రలేమి నుంచి బయట పడవచ్చు. రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది.



గుండె ఆరోగ్యానికి, ఇన్‌ఫెక్షన్లు తగ్గేందుకు..

రేగు పండ్లలో ఉండే యాంటీ డిప్రెసెంట్ గుణాలు ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్‌ను తగ్గిస్తాయి. దీంతో మానసిక ఆరోగ్యం మెరుగు పడుతుంది. అలాగే వీటిల్లో ఉండే ఫ్లేవనాయిడ్స్ మెదడు పనితీరును మెరుగు పరుస్తాయి. దీంతో మెదడు యాక్టివ్‌గా పనిచేస్తుంది. ఉత్తేజంగా ఉంటారు. ఈ పండ్లలో నైట్రిక్ ఆక్సైడ్ ఉంటుంది. అందువల్ల ఈ పండ్లను తింటే హైబీపీ తగ్గుతుంది. ఈ పండ్లలో ఉండే పొటాషియం రక్త నాళాలను వెడల్పుగా చేసి రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ నియంత్రణలో ఉంటుంది. రేగు పండ్లలో బీటులినిక్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లామేటరీ గుణాలను కలిగి ఉంటుంది. దీంతోపాటు యాంటీ బ్యాక్టీరియల్ ఏజెంట్‌గా కూడా పనిచేస్తుంది. దీని వల్ల బ్యాక్టీరియా, వైరస్ ఇన్‌ఫెక్షన్లు తగ్గుతాయి.

మలబద్దకం, అలర్జీలకు..

రేగు పండ్లలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. ఇది బీటులినిక్ యాసిడ్‌కు సహాయం చేస్తుంది. దీంతో శరీరంలో గ్లూటాథియోన్ స్థాయిలు పెరుగుతాయి. ఫలితంగా ఆక్సీకరణ ఒత్తిడి తగ్గుతుంది. దీంతో క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు రాకుండా ఉంటాయి. రేగు పండ్లలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది తీవ్రమైన మలబద్దకాన్ని సైతం తగ్గిస్తుంది. దీంతో రోజూ సుఖ విరేచనం అవుతుంది. అలాగే రేగు పండ్లను మరీ అధికంగా తింటే మాత్రం వేడి చేస్తుంది. అలాగే విరేచనాలు అయ్యే అవకాశాలు కూడా ఉంటాయి. కనుక వీటిని రోజూ గుప్పెడు మోతాదులో తింటే మంచిది. ఇక ఈ పండ్లను తినడం వల్ల బ్రొమెలెయిన్ అనే ఎంజైమ్ లభిస్తుంది. ఇది దగ్గు, జలుబు నుంచి ఉపశమనాన్ని అందిస్తుంది. రేగు పండ్లలో యాంటీ అల్లెర్జిక్ గుణాలు ఉంటాయి. ఈ పండ్లను తింటే అలర్జీల నుంచి ఉపశమనం లభిస్తుంది. ఇది యాంటీ హిస్టామైన్‌గా పనిచేస్తుంది. కనుక అన్ని రకాల అలర్జీలు తగ్గుతాయి. ఇలా రేగు పండ్లను తినడం వల్ల అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. కాబట్టి ఈ సీజన్‌లో వీటిని మిస్ చేసుకోకుండా తినండి.

## ఈ మూడు నియమాలతో కిడ్నీ సమస్యలకు చెక్ పెట్టేయండి..!



హెల్త్ న్యూస్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): మారుతూ వస్తున్న జీవనశైలితో పాటు ఆహార నియమాల్లో లోపాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక రకాల వ్యాధుల ముప్పు పెరుగుతున్నది. మధుమేహం, గుండె సమస్యల తర్వాత ఎక్కువగా ప్రభావితమయ్యే శరీర భాగాలు కిడ్నీలు, కాలేయమే. షుగర్, హైబీపీ కారణంగా దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి పెరుగుతున్నది. చిన్న వయసులో ఉన్న వారిలోనే మధుమేహం, రక్తపోటుకు బాధితులుగా మారుతున్నారు. దాంతో 30 ఏళ్లలోపు కిడ్నీ వ్యాధుల్లో పెరిగే ప్రమాదాన్ని పెంచుతుంది. కిడ్నీ వ్యాధుల కారణంగా ఆరోగ్యరంగంపై అదనపు ఒత్తిడి పెరుగుతోందని, అందుకే ప్రతి ఒక్కరూ 20 ఏళ్ల నుంచి కొన్ని అలవాట్లను అలవర్చుకోవడం ముఖ్యమని పేర్కొంటున్నారు.చురుకైన జీవనశైలి, పౌష్టికాహారం తీసుకోవడం కారణంగా కిడ్నీ సమస్యలు రాకుండా చూడవచ్చని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మూత్రపిండాలు పక్కటెముకల కింద, వెన్నుముకకు రెండువైపులా ఉంటాయి. మూత్రపిండాలు రక్తం నుంచి వ్యర్థ పదార్థాలు.. అదనపు నీరు, ఇతర మలినాలను ఫిల్టర్ చేసి రక్తాన్ని శుభ్రంగా ఉంచుతాయి. ఈ వ్యర్థాలన్నీ మూత్రాశయంలో పేరుకుపోతాయి. తర్వాత మూత్రం ద్వారా ఈ మలినాలన్నీ బయటకు వెళ్లిపోతాయి. మూత్రపిండాలు శరీరంలోని పీహెచ్, సోడియం, పొటాషియం స్థాయిలను సైతం నియంత్రిస్తాయి. అందుకే సంపూర్ణ ఆరోగ్యం కోసం.. కిడ్నీల ఆరోగ్యం కాపాడుకోవాల్సిందేనని వైద్యులు పేర్కొంటున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధుల ప్రమాదాన్ని తప్పించుకునేందుకు చిన్నప్పటి నుంచే పలు అలవాట్లకు దూరంగా ఉండాలని, పలు సూచనలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

బీపీ, మధుమేహాన్ని నియంత్రించాలి

బీపీ, చక్కెర రెండూ పెరగడం ఆరోగ్యానికి చాలా హానికరం. కిడ్నీలు దెబ్బతినే ప్రమాదాన్ని పెంచుతుంది. శరీరంలోని కణాలు రక్తంలో ఉన్న గ్లూకోజ్‌ని ఉపయోగించుకోలేని సందర్భంలో కిడ్నీలు రక్తాన్ని ఫిల్టర్ చేసేందుకు శ్రమపడాల్సి వస్తుంది. అలాగే, అధిక రక్తపోటు సైతం కిడ్నీలకు హాని కలిగిస్తుంది. కిడ్నీ ఆరోగ్యంగా ఉండాలంటే.. వ్యాధులు రాకుండా ఉండాలంటే చిన్నప్పటి నుంచే రక్తపోటు, షుగర్ అదుపులో ఉంచుకోవాలి.

సమతుల్య ఆహారం తీసుకోవాలి..

సమతుల్య, పోషకాహారం తీసుకోవడం వల్ల మూత్రపిండాలు, శరీరంలోని అన్ని అవయవాలు ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. సోడియం, ప్రాసెస్డ్ మీట్ కిడ్నీలకు హాని కలిగిస్తాయి. ఆకుపచ్చ కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలు తీసుకోవాలి. కిడ్నీలు ఆరోగ్యంగా ఉండాలంటే నీరు ఎక్కువగా తాగడం చాలా మంచిది. నీళ్లు ఎక్కువగా తీసుకోవడం ద్వారా కిడ్నీలు ఆరోగ్యంగా ఉంటాయి. కాలీఫ్లవర్, బ్లూబెర్రీస్, చేపలు, తృణధాన్యాలు వంటి సహజంగా సోడియం తక్కువగా ఉండే ఆహారంలో తీసుకోవడం మంచిది.

ధూమపానికి దూరం దూరం..

ధూమపానం శరీరంలోని రక్త నాళాలను దెబ్బతీస్తుంది. ఇది మీ శరీరం అంతటా రక్త ప్రసరణను తగ్గిస్తుంది. ధూమపానం వల్ల కిడ్నీ క్యాన్సర్ వచ్చే అవకాశాలు కూడా పెరుగుతాయని గుర్తించారు. మీరు ధూమపానం చేస్తున్నట్లయితే వెంటనే మానేస్తే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.

## రోజూ ఒక కప్పు దొండకాయలను తింటే ఏం జరుగుతుందో తెలుసా..?



హెల్త్ న్యూస్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): మనకు ఏడాది పొడవున్నా అన్ని సీజన్లలో అందుబాటులో ఉండే కూరగాయలు చాలానే ఉన్నాయి. వాటిల్లో దొండకాయలు కూడా ఒకటి. ఇవి మనకు చవకగానే లభిస్తాయి. దొండకాయలతో చాలా మంది అనేక రకాల కూరలను చేస్తుంటారు. దొండకాయలతో పచ్చడి కూడా చేయవచ్చు. వేపుడు చేసుకోవచ్చు. అలాగే వీటితో మసాలా వంటకాలను కూడా చేయవచ్చు. ఇవన్నీ ఎంతో రుచిగా ఉంటాయి. బాలింతలకు, జ్వరం వచ్చి తగ్గిన వారికి దొండకాయ కూరను పథ్యంగా పెడుతారు. అయితే దొండకాయలను రోజూ ఒక కప్పు మోతాదులో తింటుంటే అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. దొండకాయలు మనకు ఎంతగానో మేలు చేస్తాయి. అనేక పోషకాలను అందించడంతోపాటు రోగాల నుంచి మనల్ని రక్షిస్తాయి.

**డయాబెటిస్ సమస్యకు..**

షుగర్ ఉన్నవారికి దొండకాయలు వరమనే చెప్పవచ్చు. దొండకాయలను రోజూ తింటుంటే షుగర్ లెవల్స్ తగ్గుతాయి. డయాబెటిస్ అదుపులో ఉంటుంది. వీటిని తినడం వల్ల ఇన్సులిన్‌ను శరీరం సరిగ్గా ఉపయోగించుకుంటుంది. దీంతో షుగర్ లెవల్స్ అదుపులోకి వస్తాయి. కిడ్నీ స్టోన్లు ఉన్నవారు దొండకాయలను తింటుంటే ఫలితం ఉంటుంది. ఈ కాయల్లో ఉండే సమ్మేళనాలు కిడ్నీ స్టోన్లను కరిగిస్తాయి. మూత్రాశయ వ్యాధులను తగ్గిస్తాయి. దొండ ఆకులను పేస్ట్‌లా చేసి వాటితో ట్యాబ్లెట్లను తయారు చేసి వాడితే బ్యాక్టీరియాతో ఏర్పడే చర్మ సమస్యలు తగ్గుతాయి. చర్మ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది.

**శ్వాసకోశ సమస్యలకు..**

దగ్గు, జలుబును తగ్గించడంలోనూ దొండకాయలు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిని తింటుంటే శ్వాసకోశ సమస్యలు తగ్గుతాయి. గొంతు, ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన కఫం తగ్గుతుంది. దీంతో దగ్గు, జలుబు నుంచి ఉపశమనం లభిస్తుంది. దొండకాయల్లో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో హైబీపీ తగ్గుతుంది. గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా నిరోధించవచ్చు. దొండకాయల్లో పీచు, ప్రోటీన్లు అధికంగా ఉంటాయి. కనుక ఉదయం ఈ కాయలను తింటే రోజంతా ఉత్సాహంగా, యాక్టివ్‌గా ఉంటారు. చురుగ్గా పనిచేస్తారు. ఎంత పనిచేసినా అలసిపోరు. అలాగే నీరసం, అలసట, బద్ధకం అనేవి ఉండవు. ఈ కాయలను తింటే కండరాల నిర్మాణం జరుగుతుంది. శరీరానికి శక్తి లభిస్తుంది.

**జీర్ణ వ్యవస్థ పనితీరుకు..**

దొండకాయలలో ఉండే ఫైబర్ జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగు పరుస్తుంది. దీంతో గ్యాస్, అసిడిటీ, కడుపు ఉబ్బరం, మలబద్ధకం నుంచి ఉపశమనం లభిస్తుంది. దొండకాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. దీంతో ఇన్‌ఫెక్షన్ల నుంచి రక్షణ లభిస్తుఏంది. దగ్గు, ఆకలి లేకపోవడం వంటి సమస్యలతో బాధపడేవారు దొండకాయలను తింటే ఫలితం ఉంటుంది. దొండకాయల్లో అనేక బి కాంప్లెక్స్ విటమిన్లు ఉంటాయి. ఇవి నాడీ మండల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్ నుంచి బయట పడతారు. మైండ్ రిలాక్స్ అవుతుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. దొండకాయల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. ఇది ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇలా దొండకాయలను రోజువారి ఆహారంలో చేర్చుకోవడం వల్ల అనేక అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు.ơం




# రిటైర్మెంట్ ప్రకటించిన రవిచంద్రన్ అశ్విన్

స్పోర్ట్స్ న్యూస్ ,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ఆఫ్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్.. అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికారు. బోర్డర్–గవాస్కర్ ట్రోఫీలో భాగంగా బ్రిస్బేన్‌లో జరిగిన మూడవ టెస్టు చివరి రోజు అశ్విన్ తన రిటైర్మెంట్ ప్రకటించేశాడు. టెస్టు కెరీర్‌లో అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్‌గా నిలిచాడు అశ్విన్. అతను 106 టెస్టుల్లో 24 యావరేజ్‌లో 537 వికెట్లు తీసుకున్నాడు. అనిల్ కుంబ్లే తర్వాత రెండో స్థానంలో ఉన్నాడతను. కుంబ్లే 132 టెస్టుల్లో 619 వికెట్లు తీసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న సిరీస్‌లో .. అశ్విన్ అడిలైడ్ టెస్టులో ఆడాడు. ఆ మ్యాచ్‌లో అతను 53 రన్స్ ఇచ్చి ఓ వికెట్ తీసుకున్నాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన హోం సిరీస్‌లో అతను కేవలం 9 వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అశ్విన్ టెస్టుల్లో 3503 రన్స్ చేశాడు. దాంట్లో ఆరు సెంచరీలు, 14 అర్ధశతకాలు ఉన్నాయి. క్రికెట్ ఆల్‌రౌండర్లలో అశ్విన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నది. మూడు వేల రన్స్, 300 వికెట్లు తీసిన 11 ఆల్‌రౌండర్ల లిస్టులో అతను ఉన్నాడు.రికార్డు స్థాయిలో అశ్విన్ 11 సార్లు ప్లేయర్ ఆఫ్ ద సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు.



రోహిత్ శర్మ : జట్టుకు ఏది అవసరమో అతనికి తెలుసునని.. తాము ఎలాంటి కాంబినేషన్ ఆలోచిస్తున్నామనే దానిపై స్పష్టమైన అవగాహన ఉందని రోహిత్ చెప్పుకొచ్చాడు. తనకు అవకాశం రానప్పుడు ఆటకు వీడ్కోలు పటకటం మంచిదని అశ్విన్ బావించి ఉండవచ్చని రోహిత్ అన్నాడు. అశ్విన్‌తో కలిసి తాను చాలా మ్యాచ్‌లు ఆడానని రోహిత్ గుర్తు చేసుకున్నాడు. అండర్ -17 స్థాయి నుంచి అశ్విన్ తనకు తెలుసున్న రోహిత్.. తొలుత ఓపెనర్‌గా వచ్చేవాడని గుర్తు చేసుకున్నాడు. చాలా రోజులు కనిపించకుండాపోయాడని.. కొద్దికాలం తర్వాత తమిళనాడు తరఫున ఓ బౌలర్ ఐదు వికెట్ల ప్రదర్శన చేశాడని విన్నానని.. అది ఎవరా అని ఆరా తీస్తే అశ్వినేనంటూ గుర్తు చేసుకున్నాడు రోహిత్.



విరాట్ కోహ్లీ: 14 ఏళ్ల నీతో కలిసి ఆడానని, రిటైర్ అవుతున్నట్లు ఇవాళ చెప్పగానే కాస్త భావోద్వేగానికి లోనైట్లు విరాట్ పేర్కొన్నాడు. తన ట్విట్టర్‌లో అతను స్పందించాడు. నీతో కలిసి ఆడిన ఆ క్షణాలన్నీ గుర్తు వచ్చినట్లు చెప్పాడు. నీతో సాగిన జర్నీలో ప్రతి సందర్భాన్ని ఎంజాయ్ చేసినట్లు కోహ్లీ పేర్కొన్నాడు. నీ నైపుణ్యం, మ్యాచ్ విన్నింగ్ సామర్థ్యాన్నిఅద్భుతమని తెలిపాడు. భారత క్రికెట్‌లో నిన్నొక లెజెండ్‌గా గుర్తిస్తారన్నాడు. నీకు, నీకు కటుంబానికి బెస్ట్ విషెస్ చెబుతున్నట్లు కోహ్లీ తెలిపాడు.

# కివీస్ ఘన విజయం



స్పోర్ట్స్ న్యూస్ ,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్):ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో న్యూజిలాండ్ 423 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. అయితే మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ఇంగ్లండ్ 2–1తో కైవసం చేసుకుంది. మంగళవారం ముగిసిన టెస్టులో కివీస్ నిర్దేశించిన 658 పరుగుల లక్ష్యఛేదన కోసం ఓవర్‌నైట్ స్కోరు 18/2తో బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ 234 పరుగులకు ఆలౌటైంది. పిచ్ పరిస్థితులను తమకు అనుకూలంగా మలుచుకుంటూ కివీస్ బౌలర్లు సాంట్నర్ (4/85), సౌథీ (2/34), హెన్రీ (2/62) ధాటికి ఇంగ్లండ్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. బెతెల్ (76), రూట్ 54) అర్ధసెంచరీలతో రాణించారు. గాయం కారణంగా కెప్టెన్ బెన్ స్టోక్స్ బ్యాటింగ్‌కు రాలేదు. సాంట్నర్‌కు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్', బ్రూక్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద సిరీస్' దక్కింది. న్యూజిలాండ్ దిగ్గజ క్రికెటర్ టిమ్ సౌథీ టెస్టులకు వీడ్కోలు పలికాడు. ఇంగ్లండ్‌తో మూడో టెస్టు ద్వారా సుదీర్ఘ ఫార్మాట్ నుంచి వైదొలిగాడు.

# వరుణుడే విజేత..

## - డ్రాగా ముగిసిన బ్రిస్బేన్ టెస్ట్ - టీమిండియా WTC ఫైనల్ ఆశలు జీవం..!




స్పోర్ట్స్ న్యూస్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో ఆస్ట్రేలియా–భారత్ మధ్య జరిగిన మూడో టెస్ట్ డ్రాగా ముగిసింది. ఈ మ్యాచ్ తర్వాత ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (WTC) పాయింట్ల పట్టికలో భారత జట్టు మూడవ స్థానంలోనే కొనసాగుతున్నది. అయితే, WTC ఫైనల్‌కు చేరుకోవాలన్న భారత్ ఆశలు సజీవంగా నిలిచాయి. భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో టెస్టు డ్రాగా ముగిసిన విషయం తెలిసిందే. గబ్బా టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారత్‌కు 275 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. భారత్ తన రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా ఎనిమిది పరుగులు చేసింది. ఈ సమయంలో వరుణుడు మ్యాచ్‌కు ఆటంకం కలిగించగా.. ఇద్దరు కెప్టెన్లు మ్యాచ్‌ను డ్రాగా ముగించాలని నిర్ణయించారు.

టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్‌లో 445 పరుగులు చేసింది. దీంతో భారత్ తొలి ఇన్నింగ్స్ 260 పరుగుల వద్ద ముగిసింది. ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో 185 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. రెండో ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా ఏడు వికెట్లు కోల్పోయి 89 పరుగులు చేసింది. ఆ తర్వాత ఆసిస్ డిక్లేర్ చేశారు. దాంతో 274 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. మ్యాచ్ డ్రాగా ముగిసినప్పటికీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఆస్ట్రేలియా రెండో స్థానంలో కొనసాగుతున్నది. డ్రా నేపథ్యంలో ఇరుజట్లు పాయింట్లు పంచుకోవడంతో.. టీమిండియా పాయింట్లు 57.29 నుంచి 55.88కి పడిపోయాయి. పాయింట్ల పట్టికలో భారత్ మూడో స్థానంలో ఉండగా.. దక్షిణాఫ్రికా అగ్రస్థానంలో ఉన్నది. WTC 2023–25 సైకిల్‌లో ఫైనల్‌కు చేరుకోవాలంటే.. భారత్ తప్పనిసరిగా రాబోయే రెండు మ్యాచ్‌లలో తప్పనిసరిగా ఓటమి నుంచి గట్టెక్కాల్సిందే.

రెండు మ్యాచుల్లో ఒకటి డ్రా, ఒక విజయం నమోదు చేసినా భారత్‌కు ప్రపంచటెస్ట్ చాంపియన్‌షిప్‌పై ఆశలు సజీవంగానే ఉంటాయి. గబ్బా టెస్ట్ డ్రా అయిన తర్వాత, భారత్ గరిష్ఠంగా 138 పాయింట్లను పొందే అవకాశం ఉంటుంది. ఆస్ట్రేలియాతో మెల్‌బోర్న్, సిడ్నీ టెస్టులను గెలిస్తే పాయింట్లు 60.52కి చేరుతాయి. రోహిత్ శర్మ నేతృత్వంలోని టీమిండియా రెండు టెస్టుల్లో విజయం సాధిస్తే 3–1 తేడాతో సిరీస్‌ను కైవసం చేసుకుంటుంది. దాంతో పాయింట్లు 60.52కి చేరుతాయి. ఆస్ట్రేలియా తర్వాత శ్రీలంకతో తలపడనున్నది. శ్రీలంకపై తన రెండు టెస్టులను గెలిచినా.. పాయింట్లు 57కి చేరుతాయి. దాంతో డిపెండింగ్ చాంపియన్ అయిన ఆసిస్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ రేసును నుంచి నిష్క్రమిస్తుంది. భారత్–ఆస్ట్రేలియా మధ్య సిరీస్ 2–2తో డ్రా అయితే.. భారత్ పీసీటీ 57.01 పాయింట్లు ఉంటాయి. దాంతో ఫైనల్ రేసు నుంచి నిష్క్రమిస్తుంది.




# భారత్‌లో వరల్డ్ బాక్సింగ్ ఫైనల్




స్పోర్ట్స్ న్యూస్ ,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): ారత్‌లో మరో ప్రతిష్ఠాత్మక బాక్సింగ్ టోర్నీకి రంగం సిద్ధమైంది. వచ్చే ఏడాది నవంబర్‌లో వరల్డ్ బాక్సింగ్ ఫైనల్‌కు భారత్ ఆతిథ్యమివ్వబోతున్నది. దీనికి తోడు ప్రపంచ బాక్సింగ్ కాంగ్రెస్ భేటీ జరగనుంది. ఈ మేరకు ప్రపంచ బాక్సింగ్ సమాఖ్య మంగళవారం ఒక ప్రకటనలో అధికారికంగా పేర్కొంది. గతేడాది మహిళల ప్రపంచ బాకింసగ్ టోర్నీకి వేదికైన భారత్ 2025లో వరల్డ్ బాక్సింగ్ ఫైనల్ జరుగనుండటం చాలా సంతోషంగా ఉందని జాతీయ బాక్సింగ్ ఫెడరేషన్ (బీఎఫ్ఐ) అధ్యక్షుడు అజయ్‌సింగ్ అన్నారు. 'ప్రతిష్ఠాత్మక టోర్నీలకు భారత్ వేదిక కావడం గర్వంగా ఉంది. మెగాటోర్నీ ద్వారా దేశంలో బాక్సింగ్‌కు మరింత ఆదరణ పెరుగుతుంది' అని పేర్కొన్నారు.



# సినిమా న్యూస్

# సూపర్ స్ట్రాటజీతో జాక్ రిలీజ్ డేట్ ఫైనల్



మూవీ న్యూస్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): :టాలీవుడ్ యాక్టర్ సిద్ధు జొన్నలగడ్డ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే. ఈ క్రేజీ యాక్టర్ నటిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటి జాక్ బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ SVCC 37గా వస్తోంది. మేకర్స్ తాజాగా విడుదల తేదీపై క్లారిటీ ఇచ్చారు. ప్రభాస్ నటిస్తోన్న రాజాసాబ్‌ను 2025 ఏప్రిల్ 10న విడుదల చేస్తున్నట్టు ప్రకటించగా.. రిలీజ్ వాయిదా పడుతుందంటూ వార్తలు తెరపైకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో జాక్ సినిమాను ఇదే తేదీన విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు. తాజా లుక్‌లో నిర్మానుష్య ప్రదేశంలో ఓ వైపు జీపు కనిపిస్తుండగా.. మరోవైపు గన్‌ను చూడొచ్చు. రాజాసాబ్ తేదీన వస్తుండటంతో సూపర్ బజ్ క్రియేట్ అవడం పక్కా అని అర్థమవుతోంది.ఈ మూవీని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రానికి అచ్చు రాజమణి సంగీతం అందిస్తున్నారు. సిద్ధు జొన్నల గడ్డ దీంతోపాటు నీరజ కోన డైరెక్షన్‌లో తెలుసు కదా సినిమా చేస్తుండగా.. మరోవైపు టిల్లు 3 కూడా లైన్‌లో ఉంది.

# 'గేమ్ ఛేంజర్' నుంచి మరో సాంగ్.. 'ధోప్' ప్రోమో రిలీజ్



మూవీ న్యూస్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తేజ్ నటిస్తున్న హై వోల్టేజ్ యాక్షన్ మూవీ గేమ్ ఛేంజర్ తమిళ స్టార్ డైరెక్టర్ శంకర్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. కార్తీక్ సుబ్బరాజు కథను అందిస్తున్నాడు. ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్ బస్టర్ తర్వాత రామ్ చరణ్ మూవీ కోసం మెగా అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే.ఆచార్య సినిమా వచ్చిన ఈ సినిమా డిజాస్టర్ అవ్వడంతో వారి ఆశలన్నీ ప్రస్తుతం వస్తున్న గేమ్‌ఛేంజర్ పైనే ఉన్నాయి. పొలిటికల్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్ రాజు తెరకెక్కిస్తున్నారు. ఇక ఈ సినిమాను సంక్రాంతి? కానుకగా జనవరి 10న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు మేకర్స్.ఇప్పటికే మూవీ నుంచి టీజర్‌తో పాటు మూడు పాటలను విడుదల చేయగా.. మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మూవీ నుంచి మరోసాంగ్‌ను విడుదల చేయబోతున్నారు మేకర్స్. ఈ మూవీ నుంచి 'ధోప్' అనే పార్టీ సాంగ్‌ను డిసెంబర్ 21న రిలీజ్ చేయునున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ సందర్భంగా సాంగ్ ప్రోమోను పంచుకున్నారు.

# నాగచైతన్య, సాయిపల్లవి శివతాండవం..



మూవీ న్యూస్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య కాంపౌండ్ నుంచి వస్తోన్న చిత్రం తండేల్ . చందూ మొండేటి డైరెక్షన్‌లో రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ మూవీలో సాయిపల్లవి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఈ చిత్రాన్ని 2025 ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు మేకర్స్.ఇప్పటికే విడుదల చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా తండేల్ సెకండ్ సింగిల్ అప్‌డేట్ అందించారు మేకర్స్. శివశక్తి ఫుల్ సాంగ్‌ను డిసెంబర్ 22న తెలుగు, హిందీ, తమిళ భాషల్లో విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. చైతూ, సాయిపల్లవి శివతాండవం చూపించబోతున్నట్టు తాజా లుక్ చెప్పకనే చెబుతోంది.2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోంది తండేల్. ఈ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తుండగా.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి.

# పవన్ కల్యాణ్ ఓజీ సాంగ్‌లో డీజే టిల్లు భామ..!



మూవీ న్యూస్,18 డిసెంబర్ (క్రాంతి న్యూస్): టాలీవుడ్ స్టార్ హీరో పవన్ కల్యాణ్న టిస్తోన్న మోస్ట్ క్రేజీయెస్ట్ సినిమా ఓజీ సుజిత్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో షూటింగ్ కొనసాగుతోంది. ఇప్పటికే షూటింగ్‌కు సంబంధించిన స్టిల్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. కాగా ఈ సినిమాకు సంబంధించిన ఆసక్తికర వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది.ఈ చిత్రంలో స్పెషల్ సాంగ్ ఉండబోతుందట.. ఈ పాటలో డీజే టిల్లు భామ నేహాశెట్టి మెస్మరైజ్ చేయబోతుందట. పవన్ కల్యాణ్‌తో నేహాశెట్టి స్టెప్పులేయబోతుందన్న వార్తలపై ప్రస్తుతానికి అధికారిక ప్రకటన ఏం రాకున్నా.. ఈ అప్‌డేట్‌ను మాత్రం ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు మూవీ లవర్స్ అండ్ ఫ్యాన్స్. ఈ చిత్రంలో గ్యాంగ్ లీడర్ ఫేం ప్రియాంకా ఆరుళ్ మోహన్ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. శ్రియారెడ్డి కీలక పాత్రలో నటిస్తున్న ఈ చిత్రానికి ఎస్ థమన్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై డీవీవీ దానయ్య తెరకెక్కిస్తున్నారు. మేకర్స్ ఇప్పటికే లాంచ్ చేసిన ఓజీ హంగ్రీ చీతా గ్లింప్స్.. పవన్ కల్యాణ్ పూర్తిగా నయా అవతార్‌లో చూపిస్తూ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాడు. ఈ చిత్రంలో పాపులర్ జపనీస్ నటుడు కజుకి కిటముర, ప్రముఖ థాయ్ యాక్టర్ విథాయ పన్నరింగర్మ్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

Printed, Published and owned by -----------------------, Printed at -----------------------, H.No. 00000000, ######, #####, 3#####, ##### #####. Telangana State,
Published from ##### #####, H.No. 000000000, ##### #####, ##### #####, ##### ##### ##### #####. ##### #####, Telangana State. Editor: asfghjklqwertt, RNI. No. APTEL/0000/00000, Cell: 1234567890, 0987654321 Email: sample@company.com